thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

రాజస్థాన్ పై ఢిల్లీ పంజా



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 42 | జగిత్యాల | శనివారం | 02 మే, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

# ఆర్టీసీ కార్మికులకు శుభవార్త

## సమ్మె కాలానికి వేతనం.. కేసుల ఎత్తివేత

కార్మిక సంఘాల విజ్ఞప్తిపై సీఎం సానుకూల నిర్ణయం

వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నంకు ఆదేశం





ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల మూడు రోజుల పాటు నిర్వహించిన సమ్మె కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించడంతో పాటు ఆ సమయంలో వారిపై నమోదైన పోలీసు కేసులను కూడా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించారు.

**హైదరాబాద్, మే 1:** రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి ఉదారత చాటుకున్నారు. ఇటీవల 3 రోజుల పాటు నిర్వహించిన సమ్మె కాలానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని, ఆ సమయంలో వారిపై నమోదైన కేసులను ఎత్తివేయాలని నిర్ణయించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ఆయనను కలిసిన సందర్భంగా ఈ కీలక ప్రకటన వెలువడింది. తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపిన సీఎంకు కార్మిక

మిగతా 2 లో

## ఆర్టీసీకి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వంలో సంస్థ విలీనంతో చిత్తశుద్ధి చాటాం

- త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు
- మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం



2



## నేర నియంత్రణలో టెక్నాలజీ వినియోగం

- నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది
- దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్
- డ్రగ్స్ నియంత్రణకు మరింత కఠిన చర్యలు
- డీజీపీగా సీవీ ఆనంద్ ప్రమాణస్వీకారం

తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు.

2

## కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

- సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది
- 120మంది ఆటో డ్రైవర్ల ఆత్మహత్య
- కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ సర్కార్
- మేడే ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3





## జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు జూన్ 2తో మోక్షం

ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్‌తో పాటే కేటాయింపు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్.. వెల్లడించిన మంత్రి పొంగులేటి

2

## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు



3

ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కింద డీజీపీ, మాజీ డీజీపీ, ట్రాఫిక్ జాయింట్ సీపీకి నోటీసులు ఇచ్చింది.

## ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం



- ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొన్న కారు
- ఆరుగురు అక్కడికక్కడే మృతి.. మరొకరి పరిస్థితి విషయం
- మృతులంతా యాదగిరిగుట్టు వెళ్లి వస్తుండగా ప్రమాదం

వివరాలు 2వ పేజీలో

## భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

- 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు
- హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం



వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది.

## ఇరాన్‌తో యుద్ధాన్ని ఆపేశాం



- వైట్ హౌస్ సంచలన ప్రకటన
- అమెరికా చట్టసభలకు ట్రంప్ సర్కారు లేఖ
- 60 రోజుల గడువు ముగియడంతోనే ఎత్తుగడ
- కాంగ్రెస్ అనుమతి నుంచి తప్పించుకునే వ్యూహం

ఇరాన్‌తో నెలకొన్న ఘర్షణల విషయంలో అమెరికా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్ తో తాము యుద్ధాన్ని ఆపేశామని వైట్ హౌస్ అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు అమెరికా చట్టసభకు (కాంగ్రెస్‌కు) ఒక అధికారిక లేఖను పంపింది. పశ్చిమాసియాలో ఇప్పటికీ అమెరికా దళాలు పెద్ద సంఖ్యలో మోహరించి ఉన్నప్పటికీ.. వైట్ హౌస్ అకస్మాత్తుగా ఈ ప్రకటన చేయడం అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించింది.

2



# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు జూన్ 2తో మోక్షం

**ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్‌తో పాటే కేటాయింపు**

**రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్.. వెల్లడించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, మే 1:** రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, జూన్ 2వ తేదీ నాటికి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీతో పాటు ఇతర జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీల ప్రతినిధులతో ఆయన సుదీర్ఘంగా సమావేశమయ్యారు. న్యాయపరమైన చిక్కుల్లేకుండా, ఎలాంటి విమర్శలకు తావులేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టుల సంక్షేమం పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారని మంత్రి తెలిపారు. 'ఫ్యూచర్ సిటీ'లో ఎమ్మెల్యేలు, బ్యూరోక్రాట్స్‌తో సమానంగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు కేటాయించడానికి ముఖ్యమంత్రి అంగీకరించినట్లు పొంగులేటి వెల్లడించారు. 18 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం చూస్తున్నా, న్యాయ వివాదాల వల్ల అది మళ్లీ మొదటికి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. జూన్ 2 నాటికి ఈ సమస్యను ఒక కొలిక్కి తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులందరూ ఒకే తాటిపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం ఉన్న మూడు ప్రధాన సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సంఘాల్లో సభ్యులు కాకపోయినా, అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకు స్థలం కేటాయిస్తామని ప్రకటించారు. గతంలో 18 ఏళ్ల క్రితమే స్థలాల కోసం జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీ సభ్యులు ఒక్కొక్కరు రూ. 2 లక్షలు చెల్లించారని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తమకు ప్రాధాన్యత ఇవ్వాలని సభ్యులు కోరగా, దానిపై సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ సాగుకు సర్కారు దన్ను

**మే 4న 'టీజీ ఆర్గానిక్స్' యాప్ ప్రారంభం**

**హైదరాబాద్:** తెలంగాణ వ్యవసాయ రంగంలో సేంద్రియ సాగును మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. సేంద్రియ రైతులు పండించిన పంటలకు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు 'టీజీ ఆర్గానిక్స్' అనే ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను మే 4వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. రసాయన ఎరువులు లేని నాణ్యమైన ఆహారాన్ని నేరుగా రైతుల వద్ద నుండే కొనుగోలు చేసే వెసులుబాటును ఈ యాప్ కల్పిస్తోంది. నేటి కాలంలో రసాయన ఎరువుల వాడకం వల్ల ఆహారం విషతుల్యమవుతున్న తరుణంలో, సేంద్రియ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ పెరుగుతోంది. అయితే మార్కెట్‌లో సరైన గుర్తింపు, నాణ్యతా ప్రమాణాలు లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధ్రువీకరణ అథారిటీ ద్వారా సర్టిఫికేట్లు పొందిన రైతుల వివరాలను మాత్రమే ఈ యాప్‌లో పొందుపరిచారు. దీనివల్ల వినియోగదారులకు కల్తీలేని ఆహారం లభించడమే కాకుండా, రైతులకు గిట్టుబాటు ధర దక్కనుంది. ఈ యాప్‌లో సేంద్రియ రైతు పేరు, మొబైల్ నంబర్, చిరునామా, లొకేషన్ వివరాలు అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా రైతు వద్ద ఉన్న వివిధ రకాల సేంద్రియ ఉత్పత్తుల సమాచారాన్ని కూడా ఇందులో పొందుపరిచారు. ఉత్పత్తుల ధరను నిర్ణయించే అధికారం కేవలం రైతుకే ఉంటుంది కాబట్టి, వినియోగదారులు నేరుగా రైతును సంప్రదించి ధర విషయాలను చర్చించుకోవచ్చు. ప్రస్తుతం దాదాపు 500 మంది రైతులు ఈ యాప్‌లో నమోదు చేసుకోగా, సుమారు 100కు పైగా సేంద్రియ ఉత్పత్తులను కస్టమర్ల కోసం సిద్ధంగా ఉంచారు. ఏకలవ్య ఫౌండేషన్, సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ వంటి సంస్థల ద్వారా ధృవీకరణ పొందిన రైతుల వివరాలను కూడా ఇందులో చేర్చారు. రసాయన సాగు వల్ల పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులను తగ్గించి, ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ యాప్‌ను తీసుకువస్తోంది. తెలంగాణ సేంద్రియ సాగులో ఈ యాప్ ఒక నూతన విప్లవానికి నాంది కానుందని నిపుణులు భావిస్తున్నారు.

# ఇరాన్‌తో యుద్ధాన్ని ఆపేశాం

**వైట్ హౌస్ సంచలన ప్రకటన.. అమెరికా చట్టసభలకు లేఖ**



**వాషింగ్టన్:** ఇరాన్‌తో నెలకొన్న ఘర్షణల విషయంలో అమెరికా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్‌తో తాము యుద్ధాన్ని ఆపేశామని వైట్ హౌస్ అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు అమెరికా చట్టసభకు (కాంగ్రెస్ కు) ఒక అధికారిక లేఖను పంపింది. పశ్చిమాసియాలో ఇప్పటికీ అమెరికా దళాలు పెద్ద సంఖ్యలో మోహరించి ఉన్నప్పటికీ.. వైట్ హౌస్ అకస్మాత్తుగా ఈ ప్రకటన చేయడం అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించింది. ప్రస్తుతం ఇరాన్ తో కాల్పుల విరమణ అమలులో ఉన్నందున, అధికారికంగా యుద్ధం ముగిసినట్లేనని డొనాల్డ్ ట్రంప్ సర్కారు గట్టిగా వాదిస్తోంది. అయితే, ఈ ప్రకటన వెనుక ఉన్న అసలు కారణం చట్టపరమైన చిక్కుల నుంచి బయటపడటమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమెరికా రాజ్యాంగంలోని 1973 వార్ పవర్స్ రిజల్యూషన్ (సైనిక చర్యలపై అధ్యక్షుడి అధికారాలను నియంత్రించే చట్టం) ప్రకారం.. విదేశాల్లో సైనిక చర్యలు చేపట్టిన 60 రోజుల లోపు అధ్యక్షుడు తప్పనిసరిగా కాంగ్రెస్ అనుమతి తీసుకోవాలి. ఒకవేళ చట్టసభల అనుమతి లభించకపోతే తక్షణమే యుద్ధాన్ని ఆపేయాలి. బలగాల ఉపసంహరణ కోసం భద్రతా కారణాల దృష్ట్యా మరో 30 రోజుల అదనపు గడువు మాత్రమే కోరే అవకాశం ఉంటుంది. ఈ చట్టపరమైన గడువు నుంచి తప్పించుకునేందుకే ట్రంప్ సర్కారు ఈ సరికొత్త లీగల్ వ్యూహాన్ని తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. యుద్ధం ఇప్పటికే ముగిసిపోయింది కాబట్టి.. ఇక కొత్తగా కాంగ్రెస్ అనుమతి అవసరం లేదనేది వైట్ హౌస్ ప్రధాన వాదన. ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన ఇజ్రాయెల్ తో కలిసి అమెరికా దళాలు ఇరాన్ పై సంయుక్తంగా గగనతల దాడులు ప్రారంభించాయి. ఆ దాడులు జరిగిన 48 గంటల లోపే డొనాల్డ్ ట్రంప్ అధికారికంగా ఈ ఘర్షణల గురించి కాంగ్రెస్ కు సమాచారం అందించారు. అప్పటినుంచి లెక్కవేసుకుంటే మే ఒకటో తేదీతో సరిగ్గా 60 రోజుల గడువు ముగిసింది. చట్టసభల్లో చర్చకు వస్తే ఎదురయ్యే వ్యతిరేకతను, ఇతర రాజకీయ పరిణామాలను నివారించేందుకే గడువు ముగిసిన వెంటనే తెలివిగా 'యుద్ధం ముగిసింది' అనే ప్రకటన చేశారని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# ఆర్టీసీ కార్మికులకు సీఎం శుభవార్త

**మొదటి పేజీ తరువాయి**



సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ఇటీవల మూడు రోజుల పాటు సమ్మె నిర్వహించిన విషయం విదితమే. ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడంతో కార్మికులు తమ సమ్మెను విరమించి విధుల్లో చేరారు. ఈ క్రమంలోనే సమ్మె కాలానికి సంబంధించిన మూడు రోజుల వేతనాన్ని మంజూరు చేయాలని, ఆందోళనల సమయంలో పెట్టిన కేసుల నుంచి ఉపశమనం కలిగించాలని కార్మిక నేతలు ముఖ్యమంత్రిని కోరారు. వారి అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన సీఎం, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వేతనాల చెల్లింపునకు, కేసుల ఎత్తివేతకు తక్షణమే అంగీకరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను వేగవంతం చేసే బాధ్యతను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులకు అప్పగించారు. సమ్మె కాలపు వేతనం అందజేయడంతో పాటు కేసుల ఎత్తివేతకు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆర్టీసీకి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రభుత్వంలో సంస్థ విలీనంతో చిత్తశుద్ధి చాటాం**

**త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు**

**మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్**



**సిద్దిపేట, మే1:** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వం మాదిరి వారు సమ్మె పట్టించుకోకుండా ఉండలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. 140 సంవత్సరాలుగా ఏదో ఒక హక్కు డిమాండ్‌తో మేడే నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపోలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్తే వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్గం కార్మిక సంఘాలతో చర్చించి పలు అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని ప్రస్తావించారు. ఈ సమావేశంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించామని స్పష్టం చేశారు. త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియను గుర్తింపు పొందిన సంఘం అధికారుల కమిటీ పూర్తి చేస్తుందని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా తాము వ్యవహరిస్తున్నామని అన్నారు. ఆర్టీసీపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, కేబినెట్ మంత్రులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా 380 రూట్‌లలో కొత్తబస్సులు నడుస్తున్నాయని చెప్పుకొచ్చారు. 7 లక్షల మంది ప్రయాణికులకు కనెక్టివిటీ పెంచామని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రవాణా శాఖ మంత్రిగా.. ప్రభుత్వానికి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. హక్కుల కోసం ఏవిధంగా పోరాడామో సంస్థ అభివృద్ధికి కార్మికులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

# నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

- నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది
- దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్
- డ్రగ్స్ నియంత్రణకు మరింత కఠిన చర్యలు
- డీజీపీగా సీవీ ఆనంద్ ప్రమాణస్వీకారం



**హైదరాబాద్, మే 1:** తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబృందం బాగా కృషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోంది. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే.. ఈ కేసు గురించి నాకు తెలుసు. త్వరలో ఈ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం పూర్తిస్థాయిలో అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా గుర్తింపు పొందిందని.. బ్రాండ్ ఇమేజ్ సాధించిందని అన్నారు. శాంతి భద్రతలు కాపాడటం, నేర నియంత్రణ, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలు కాపాడటంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు నేరాల్లో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు భారీగా పెరిగాయన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సమస్య ఇప్పుడు సమాజంలో విస్తరించిందని.. దాన్ని అరికట్టడం కోసం ఈగిల్, నార్కోటిక్స్ సెల్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు టాప్ ప్రయారిటీ ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేయబోతున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. మహిళల సేఫ్టీ, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలు వ్యవస్థీకృత నేరాలుగా మారాయని.. వీటిపై ప్రత్యేక దృష్టి పెడతామని డీజీపీ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే ప్రమాదాలపై కూడా పోలీసు శాఖ మరింత దృష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, సరైన విధంగా పోలీస్ శాఖలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని.. రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్‌లో మార్పులు తీసుకొస్తామని డీజీపీ తెలిపారు. పోలీస్ శాఖలో అధికారులు.. సంప్రదాయాలు, మర్యాదలు మరచిపోతున్నారని సీవీ ఆనంద్ అన్నారు. వాటిని గుర్తు చేసి, అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేర దర్యాప్తులో సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడటం సరికాదని.. సీన్ ఆఫ్ అఫెన్స్‌లో దొరికిన ఆధారాలతోనే కేసులను ఛేదించే పాత పద్ధతులను మళ్లీ తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోవధపై పోలీసులే చర్యలు తీసుకుంటారని, ప్రైవేటు వ్యక్తులు రోడ్లపైకి రావొద్దని సీవీ ఆనంద్ హెచ్చరించారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. 2021 డిసెంబర్ 24న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన ఆయన.. 2023 ఆగస్టు 7న డీజీగా పదోన్నతి పొందారు. 2024 సెప్టెంబర్ 7న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 సెప్టెంబర్ 27 నుంచి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన 2028జూన్ వరకు డీజీపీగా కొనసాగనున్నారు.

# ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

- ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొన్న కారు
- ఆరుగురు అక్కడిక్కడే మృతి..
- మరొకరి పరిస్థితి విషయం
- యాదగిరిగుట్టు వెళ్లి వస్తుండగా ప్రమాదం



**హైదరాబాద్, మే 1:** శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోయి, నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన కారును యంత్రాల సహాయంతో బయటకు తీసారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16వ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన కారు నెంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు. మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు.

# పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

**పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు**

**హైదరాబాద్, మే 1 :** ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ కింద డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. పెండింగ్ చలాన్‌లు ఉంటే వాహనాలు సీజ్ చేయొద్దని ఈ ఏడాది జనవరి 20న హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఏప్రిల్ 9న మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని ఆరోపిస్తూ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హోంశాఖ సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది విజయ్ గోపాల్.. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులు అమలు చేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాహనం ఆర్సీ బుక్‌ను చూపించినా అంగీకరించడం లేదని న్యాయవాది తెలిపారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

# రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వం



- సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది
- 120మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు
- కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ సర్కార్
- మేడే ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, మే 1:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సరైన పని దినాలు, వసతులు కల్పించక ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు.సఫాయిల శ్రమను.. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితులయ్యారు. మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామనడానికి వాళ్లు వరద బాధితులా అని అన్నారు. రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేతినిండా పని కల్పించి ఆదుకున్నదని, నగరంలో రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కార్మికులకు ఉచిత రైళ్లను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి వల్ల, అసమర్థత వల్ల ఎస్-ఎల్‌బీసీ కుప్పకూలిపోయి చనిపోయిన కార్మికులను అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 60 మంది సజీవదహనం అయితే పట్టించుకున్న నాథులే లేరని దుయ్యబట్టారు. కోటి రూపాయల నష్ట పరిహారం ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. నగరంలో వలసవచ్చి నివాసమేర్పచుకున్న కార్మికుల ఇళ్లను హైడ్రా పేరిట కూల్చి రోడ్డుపాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమే జరుగుతున్నవని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఎన్నికలకు ముందు దాన,వీర, శూర కర్ణ. ఎన్నికల తరువాత కుంబకర్ణ పాత్రను పోషిస్తున్నాడని దుయ్యబట్టారు. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే.. తాము రోడ్లు, వంతెనలు పూర్తి చేశామన్నారు. ' తెలంగాణ అంటే ప్రేమ ఉంది కాబట్టే.. లాక్‌డౌన్‌లో రోడ్లు, వంతెనలు నిర్మించాం. లాక్‌డౌన్ సమయంలో రాష్ట్రంలోని కార్మికులు స్వస్థలాలకు బయల్దేరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో లేబర్ క్యాంపులకు వెళ్లి కార్మికులకు దండం పెట్టి.. రోడ్లు నిర్మించాం అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# టెండర్లలో భారీ స్కామ్: రాష్ట్ర ఖజానాపై వేల కోట్ల భారం

**25 శాతం వరకు ఎక్సెస్ టెండర్లు..**
**హ్యామ్ రోడ్ల అవినీతి నిజమైందన్న హరీశ్ రావు**
**తాగునీటి కష్టాలపై సర్కారుపై విమర్శలు..**
**మిషన్ భగీరథను నిర్వీర్యం చేస్తున్నారని మండిపాటు**



**హైదరాబాద్, మే 1:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రహదారి నిర్మాణ టెండర్లలో భారీ కుంభకోణం జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో తాను హెచ్చరించిన 'హ్యామ్' రోడ్ల స్కామ్ ఇప్పుడు అక్షరాలా నిజమైందని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల్లో పిలిచిన టెండర్లు 22 నుంచి 25 శాతం వరకు ఎక్సెస్‌కు వెళ్లడం ప్రభుత్వ దోపిడీకి నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఆర్అండ్బీ శాఖలో రూ. 11 వేల కోట్ల పనులకు గాను వ్యయం రూ. 15 వేల కోట్లకు పెరిగిందని, అలాగే పంచాయతీ రాజ్ శాఖలో రూ. 6 వేల కోట్ల టెండర్లు రూ. 8 వేల కోట్లకు చేరుతున్నాయని హరీశ్ రావు గణాంకాలతో వివరించారు. జాతీయ రహదారుల టెండర్లు తక్కువ ధరకు (డిస్కౌంట్) జరుగుతుంటే, రాష్ట్రంలో మాత్రం అదనపు భారం పడటం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ టెండర్లలో 40 శాతం ప్రభుత్వం భరిస్తుంటే, మిగిలిన 60 శాతం కాంట్రాక్టర్లు బ్యాంకు రుణాల ద్వారా తెస్తారని, వీటికి ప్రభుత్వం సావరిన్ గ్యారెంటీ ఇస్తోందని తెలిపారు. ఈ 15 ఏళ్ల రుణ భారం చివరకు ప్రజలపైనే పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత టెండర్లలో ఒకే కంపెనీకి ఏకంగా 15 ప్యాకేజీలు దక్కబోతున్నాయని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను తీవ్రంగా వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు వాటిని ఎలా సమర్థిస్తున్నారని నిలదీశారు. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి, మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు లేకుండా మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రిటైర్డ్ అధికారులకు ఎక్స్‌టెన్షన్‌లు ఇచ్చి తప్పుడు పనులు చేయిస్తున్నారని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో తాగునీటి కష్టాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వమే కారణమని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో 'మిషన్ భగీరథ' ద్వారా ఇంటింటికీ నల్లా నీరు ఇచ్చామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని కేసీఆర్‌పై కోపంతో నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. పథకాలు, పైపులు ఉన్నా నీళ్లు రాకపోవడంతో పల్లెలు, పట్నాలు అనే తేడా లేకుండా ప్రజలు ట్యాంకర్లు, బిందెలతో రోడ్లపైకి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అబద్ధాల ప్రవాహం ఆపి, మిషన్ భగీరథ పైపుల్లో నీళ్లు పారించి ప్రజల కష్టాలు తీర్చాలని ఆయన హితవు పలికారు.

# గ్యాస్ ధరల పెంపు సామాన్యుడిపై భారం

**ఏకంగా రూ.993లకు పెంచడం దుర్మార్గం**
**కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్**



**హైదరాబాద్, మే 1:** కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం మోపారంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడిందని మంత్రి ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా, కమర్షియల్ గ్యాస్ ధరను పెంచుతూ మోదీ సర్కార్ ఈరోజు ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంచింది. దీంతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో 19 కేజీల సిలిండర్ ధర రూ.3071.50కి చేరింది. కేంద్రం నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ ప్రభుత్వం యథావిధిగా ధరలు పెంచేసిందని ఆగ్రహిస్తున్నాయి. సామాన్యుడి నడ్డి విరిచేలా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# కార్మికుల హక్కుల పరిరక్షణే మా లక్ష్యం

**మంత్రి వివేక్ వెంకటస్వామి**
**రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మే డే వేడుకలు**
**వచ్చే ఏడాది నుంచి కార్మికులకు 'పీజేఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డు**



**హైదరాబాద్, మే 1:** రాష్ట్రంలోని అన్ని రంగాల కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. శుక్రవారం మేడే పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన అధికారిక ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులకు 'శ్రమశక్తి' అవార్డులను అందజేసి వారిని గౌరవించారు. కార్మికుల భద్రత, సంక్షేమం విషయంలో యాజమాన్యాల దృక్పథంలో మార్పు రావాలని, వారు మరింత కృషి చేయాలని మంత్రి సూచించారు. రాహుల్ గాంధీ సూచనల మేరకు రాష్ట్రంలోని 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు భద్రత కల్పిస్తున్నామని, ఇందుకు సంబంధించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడం శుభపరిణామమని మంత్రి పేర్కొన్నారు. యువతలో నైపుణ్యం పెంచి ఉపాధి కల్పించేందుకు టాటా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని 120 ఏటీసీ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు రూ. 4 వేల కోట్లతో ఈ శిక్షణ కార్యక్రమాలు సాగుతున్నాయని, ఇందులో విద్యార్థులకు రూ. 2,500 చొప్పున స్కాలర్‌షిప్స్ అందిస్తున్నట్లు వెల్లడించారు. అగ్రికల్చర్ రంగాన్ని కూడా ఈ కోర్సుల్లో చేర్చామని, విదేశాల్లో ఉపాధి అవకాశాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'టామ్ కామ్'కు రూ. 90 కోట్లు కేటాయించారని వివరించారు. కార్మికుల సౌకర్యార్థం ఈఎస్ఐ సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు మంత్రి వివేక్ తెలిపారు. శంషాబాద్, రామగుండం ప్రాంతాల్లో 100 బెడ్ల ఆస్పత్రులు, మహబూబ్‌నగర్‌లో 30 బెడ్ల ఆస్పత్రిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్మికుల పక్షాన నిలబడిన దివంగత నేత పి.జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) స్మారకార్థం వచ్చే ఏడాది నుంచి 'పీజేఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును అందజేస్తామని ప్రకటించారు. కార్మికుల కోసం మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసే దిశగా కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల పెన్షన్ పెరిగే వరకు తాను పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. దివంగత నేత 'కాకా' స్ఫూర్తితో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, లేబర్ కమిషనర్ సత్పతి పమేల, హరిచందన, కార్పొరేటర్ విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

**తాగునీటి సమస్య రాకుండా చూడాలి**
**చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓఆర్ఎస్ ప్యాకెట్ల సరఫరా**
**ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు**
**హీట్ వేవ్‌పై 20 విభాగాలతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,మే 1 :** రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నుండి ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, భారత వాతావరణ శాఖ సంయుక్తంగా రూపొందించిన 'తెలంగాణ స్టేట్ హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026'ను రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. సచివాలయంలో 20 సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 15 వరకు ఎండల తీవ్రత అధికంగా ఉంటుందన్న ఐఎండీ హెచ్చరికల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వచ్చే 45 రోజుల పాటు రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చూడాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామాల్లో మోటార్లు కాలిపోతే 24 గంటల్లోపు మరమ్మతులు పూర్తి చేయాలని, హైదరాబాద్ పౌరుల కోసం రోజుకు 14 గంటల పాటు ఫిల్లింగ్ చేస్తూ 15 వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని నల్గొండ, మంచిర్యాల, సూర్యాపేట, పెద్దపల్లి, జగిత్యాల, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యం దృష్ట్యా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, ప్రత్యేకంగా 'కూల్ వార్డుల'ను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఎండలో పనిచేసే కార్మికులకు ఉపశమనం కలిగించేలా రొటేషన్ పద్ధతిలో గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా పరిశ్రమలకు సూచనలు జారీ చేయాలన్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, ప్రార్థనా స్థలాల వంటి రద్దీ ప్రాంతాల్లో షెల్టర్లు, తాగునీరు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలను ఆదేశించారు. అదేవిధంగా వేసవిలో పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్ శాఖలు నిఘా ఉంచాలని సూచించారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే బాధితులను ఆదుకోవడానికి వీలుగా 15 రోజుల్లోగా నివేదికలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే, మానవతా దృక్పథంతో వ్యవహరించి తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందేలా చూడాలని స్పష్టం చేశారు. వేసవి జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# కవిత భయంతో మేల్కొన్న కేసీఆర్

**కబ్జాలను తొలగిస్తున్న హైడ్రాపై అక్కసా.. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్**



**హైదరాబాద్, మే 1:** కవిత భయం వల్లే కేసీఆర్ బయటకు వస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవితకు మహేశ్ గౌడ్ థాంక్స్ చెప్పారు. కవిత వల్లే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మేల్కొంటున్నారని వ్యాఖ్యానించారు. హైడ్రా గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవుపలికారు. కబ్జాల నుంచి విముక్తి కల్పిస్తే కేసీఆర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటి అని ప్రశ్నించారు. హైడ్రా వల్ల బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. సిటీ చుట్టూ ఉన్న చెరువులను ఆ పార్టీ నేతలే కబ్జా చేశారని ఆరోపించారు. గులాబీ పార్టీ నేతలు ఎందుకు సభలు పెడుతున్నారని పీసీసీ చీఫ్ నిలదీశారు. తాము చేసిన డిక్లరేషన్లు అమలు చేస్తున్నామని.. త్వరలోనే పదవుల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల క్రితం పదవుల భర్తీపై చర్చించినట్లు తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుంటారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# టీఆర్ఎస్‌లో చేరనున్న బోడ జనార్దన్

**పార్టీ అధ్యక్షురాలు కవితతో మాజీమంత్రి భేటీ**



**హైదరాబాద్, మే 1 :** తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్దన్ టీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించారు. త్వరలోనే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో చేరబోతున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల పార్టీ కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు బోడ జనార్దన్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు. సీనియర్ నాయకుడైన ఆయన చేరికతో ఆ ప్రాంతంలో పార్టీకి కొత్త ఉత్సాహం రానుంది. బోడ జనార్దన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో ఉన్న చెన్నూరు శాసనసభ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది తన సత్తా చాటారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు హయాంలో ఆయన కార్మిక శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అనుభవజ్ఞుడైన నాయకుడు పార్టీలో చేరుతుండటంపై టీఆర్ఎస్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



సంపాదకీయం

# అప్పుల ఊబిలో తెలుగు రాష్ట్రాలు

## జవాబుదారీతనం ఏదీ?

రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం, అప్పులు తీర్చడం ఎలా అనే ఆలోచన నేడు పాలకుల్లో మృగ్యమవుతోంది. గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులను ప్రశ్నించినప్పుడు, అవి 'ఆస్తుల సృష్టి' కోసం చేసినవని సమర్థించుకునేవారు. ఇప్పుడు అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తూ, అంతకు మించిన అప్పులు చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు అనుసరిస్తున్న విధానాలు కూడా దీనికి భిన్నంగా ఏమీ లేవు. ప్రభుత్వాల ప్రాధాన్యతలు మారకపోతే, మరో వందేళ్లయినా ఈ అప్పుల ఊబి నుంచి బయటపడటం అసాధ్యం.

### ఉచితాల మోత - ఖజానాకు గండి

ప్రస్తుతం రాష్ట్రాల్లో జీతాలు, భత్యాలు ఇవ్వడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొంది. అయినప్పటికీ, ఉచిత పథకాల విషయంలో మాత్రం పాలకులు 'చేతికి ఎముక లేదన్నట్లుగా' ఖజానాను ఖాళీ చేస్తున్నారు. ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందడమే లక్ష్యంగా అభివృద్ధిని పక్కనపెట్టి ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. ఉచిత రేషన్, గ్యాస్, ఇల్లు, బియ్యం, పెన్షన్ వంటి పథకాల వల్ల అసలైన లబ్ధిదారుల కన్నా అనర్హులే ఎక్కువగా ప్రయోజనం పొందుతున్నారనేది జగమెరిగిన సత్యం. సంక్షేమం అవసరమే కానీ, అది మోతాదు మించితే దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలు సర్వనాశనమవుతాయి. నెలనెలా వడ్డీలకే వేల కోట్లు తగలేయడం వల్ల ఒక్క అభివృద్ధి పని కూడా ముందుకు సాగడం లేదు.

### రాజకీయ పునరావాసంగా సలహాదారుల పదవులు

ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన సమయంలో, రాజకీయ ప్రాపకం కోసం భారీగా సలహాదారులను నియమించుకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో సలహాదారుల వల్ల ఖజానాకు తీవ్ర నష్టం జరుగుతోందని విమర్శించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన హయాంలో సుమారు 14 మందిని సలహాదారులుగా నియమించారు. ఇటీవలే సీనియర్ నేత వి.హనుమంతరావును ప్రభుత్వ సలహాదారుగా, రిటైర్డ్ డీజీపీ శివధర్ రెడ్డిని భద్రతా సలహాదారుగా నియమించి వారికి క్యాబినెట్ హోదా కల్పించారు. క్యాబినెట్ మంత్రుల సంఖ్యకు సమానంగా ఉన్న ఈ సలహాదారులు అసలు ఏం చేస్తారు? వారు ఏయే విషయాల్లో సలహాలు ఇస్తారో సామాన్య జనం ప్రశ్నిస్తున్నారు. అప్పులు తెచ్చి మరీ వీరికి లక్షల్లో జీతభత్యాలు, ప్రోటోకాల్ సౌకర్యాలు కల్పించడం ఏ రకమైన పాలన అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. పదవీ విరమణ పొందిన అధికారులకు, రాజకీయ నేతలకు పునరావాసం కల్పించడానికే ఈ పోస్టులను వాడుకుంటున్నట్లు కనిపిస్తోంది.

### మార్గం ఏమిటి?

రాష్ట్రాలను దివాళా తీయించే అధికారం ఏ పాలకుడికీ లేదు. భూములను తెగనమ్మడం, మద్యం ధరలు పెంచడం, రిజిస్ట్రేషన్ ధరలు పెంచి పరోక్షంగా ప్రజలపై పన్నుల భారం మోపడం కంటే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు పెన్షన్లు రద్దు చేయాలి. సలహాదారుల సంఖ్యను కనీసానికి తగ్గించి, వారి జీతభత్యాలను నియంత్రించాలి. 2047 నాటి ఆర్థిక లక్ష్యాలను అందుకోవాలంటే వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగాలను బలోపేతం చేయాలి. వ్యవసాయోత్పత్తులను అనుబంధ రంగాలతో అనుసంధానించడం ద్వారా ఆర్థిక నిచ్చెనను నిర్మించాలి. ప్రభుత్వం విద్యార్థులకు అందజేసే వస్తువుల విషయంలో సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ వంటి పారదర్శక విధానాలను తీసుకురావాలి, తద్వారా అక్రమాలను అరికట్టి నిధులను ఆదా చేయవచ్చు.

**ప్రజలు అధికారం అప్పగించింది అప్పులు చేయడానికి కాదు, బాధ్యతాయుతమైన పాలన అందించడానికని పాలకులు గుర్తించాలి. అప్పులు తీర్చడం ప్రథమ కర్తవ్యంగా భావించి కఠిన నిర్ణయాలు తీసుకోకపోతే, భవిష్యత్తు తరాలకు ఆర్థిక సంక్షోభాన్ని వారసత్వంగా ఇచ్చినవారవుతారు.**




# భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

- 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు
- హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం

**న్యూఢిల్లీ, మే 1:** పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్బంధించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర గతంలో రూ.2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య



ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇదిలా ఉండగా.. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు, విమానయాన రంగానికి పెద్ద ఊరటనిస్తూ దేశీయ విమానయాన సంస్థలకు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల్లోనూ కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

# గ్యాస్ ధరల పెంపు.. ఎలక్షన్ బిల్లు

- గ్యాస్ ధరల పెంపు.. ఎలక్షన్ బిల్లు
- ధరలపై తాము ముందే చెప్పాం
- పెట్రో, డీజిల్ బాదుడుకు సిద్ధంగా ఉండాలి
- గ్యాస్ ధర పెంపుపై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, మే 1:** దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ.1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు. 'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనా ప్రభావం పడుతుంది. మొదట ఎల్పీజీ గ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్–డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు. ఎన్నికలు ముగిశాక దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. 'అలర్ట్‌గా ఉండండి.. ఎన్నికల వల్ల కలిగిన ఉపశమనం ఇక ముగిసినట్టే. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను దండుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి ధరాభారాన్ని ప్రజలపై పెడుతుంది' అని రాహుల్ అప్పట్లో విమర్శించారు



# పైలట్లకు విశ్రాంతిపై నిబంధనలు బేఖాతరు

- ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆందోళన

**న్యూఢిల్లీ, మే 1:** పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలు అమల్లోకి రాకపోవడంపై ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తంచేసింది. విమాన ప్రయాణంలో పైలట్లు అనారోగ్యానికి గురవడం, మరణించడం వంటి విషయాలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కు లేఖ రాసింది. ఇటీవల విధుల్లో ఉండగానే పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో విమాన భద్రత, నియంత్రణ, విమాన సిబ్బంది శ్రేయస్సు వంటి విషయాల్లో ఆందోళన వ్యక్తంచేసింది. గతంలో పలు విజ్ఞప్తులు చేసినప్పటికీ.. పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించే నిబంధనలను నిరంతరం వాయిదా వేయడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని పైలట్స్ అసోసియేషన్ పేర్కొంది. విమానయాన సంస్థలకు నిరంతరం మినహాయింపు లను మంజూరుచేస్తుండడం ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను నీరుగార్చిందని తెలిపింది. తాత్కాలిక చర్యలుగా ప్రవేశపెట్టిన ఈ సడలింపుల వల్ల పైలట్లకు విశ్రాంతి ఉండట్లేదని పేర్కొంది. దీనివల్ల వారు మానసికంగా, శారీరకంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను వెంటనే అమలుచేయడానికి మార్గదర్శకాలు రూపొందించాలని డీజీసీఏను కోరింది.




# ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

## రూ.1,745 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

## ఎక్స్ వేదికగా హోంమంత్రి అమిత్ షా వెల్లడి



**ముంబయి, మే 1:** ముంబయిలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించుకున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ముంబయిలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక చిన్న సరకును గుర్తించి.. దానినుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికి గాను ఎన్‌సీబీ బృందాన్ని ఆయన అభినందించారు. కాగా.. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను ఇటీవల తుర్కియే నుంచి భారత్‌కు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

# పెట్రో ధరలు పెంచడం లేదు

## ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడి

**న్యూఢిల్లీ, మే 1:** దేశంలోని వాహనదారులకు, సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని సవరించినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండబోదని, అవి స్థిరంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు, ప్రభుత్వ పన్నుల సవరణలు జరిగినప్పటికీ, సామాన్య వినియోగదారులపై అదనపు భారం పడకుండా చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వం ఇటీవల ఎక్సైజ్ సుంకంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ, ఆ ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయకూడదని ప్రభుత్వం, చమురు కంపెనీలు నిర్ణయించాయి. ఇంధన సరఫరా గొలుసులో స్థిరత్వాన్ని కాపాడతామని, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన ధరలు పెరగకపోవడం అనేది రవాణా రంగంపై సానుకూల ప్రభావం చూపుతుంది. తద్వారా కూరగాయలు, ఇతర నిత్యావసరాల రవాణా ఖర్చులు పెరగకుండా ఉంటాయి. అంతర్జాతీయంగా ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ వంటి పరిణామాల వల్ల చమురు మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, దేశీయంగా ధరలను నియంత్రణలో ఉంచడం గమనార్హం.

# మమతా బెనర్జీపై నిఘా ఉంచాం..

## ఫోటో షేర్ చేసిన సువేందు

**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఒక ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం రాత్రి నాలుగు గంటల సేపు ఉండటం, తెల్లవారుజామున 12.07 గంటలకు అక్కడి నుంచి వెళ్లిపోవడంపై బీజేపీ నేత సువేందు అధికారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలకు ముందు ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆమె కదలికలపై తాము నిఘా ఉంచినట్టు చెప్పారు. అనుక్షణం ఆమె కదలికను తమ ఏజెంట్ గమనిస్తూ వచ్చినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి భవానీపూర్ స్ట్రాంగ్ రూమ్‌లో మమతా బెనర్జీ ఉన్న ఫోటోను సోషల్ మీడియాలో ఆయన శుక్రవారం షేర్ చేశారు. 'ఔట్‌గోయింగ్ సీఎం ఎంత ప్రయత్నించినా నిబంధనలు ఉల్లంఘించకుండా మేము అడ్డుకున్నాం' అని సువేందు పేర్కొన్నారు. భవానీపూర్ నియోజక వర్గం నుంచి మమతాబెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీ చేశారు. సఖావత్ మెమోరియల్ స్కూలులో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ను మమతాబెనర్జీ గురువారం రాత్రి సందర్శించడంతో హైడ్రామా చోటుచేసుకుంది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నట్టు పలు ఫిర్యాదులు వచ్చినందునే తాను స్వయంగా వచ్చినట్టు మమత చెప్పారు. కేంద్ర బలగాలు తొలుత తనను రానీయలేదన్న ఆమె.. అక్కడే నాలుగు గంటల పాటు ఉన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు వస్తూ, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ఎలాంటి చర్యలను సహించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈవీఎంలు దొంగిలించేందుకు, ఓట్ల లెక్కింపులో అవకతవకలు చేసేందుకు ఎవరు ప్రయత్నించినా జీవన్మరణ పోరాటం చేస్తామని అన్నారు. కాగా, ఉత్తర కోల్‌కతాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను నేతాజీ ఇండోర్ స్టేడియంలో భద్రపరచగా, అక్కడ కూడా టీఎంసీ నేతలు ధర్నాకు దిగారు.



## కార్మికుల శ్రమకు సలాం

- కార్మికులతో కలిసి ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న మంత్రి సీతక్క



**ములుగు:** కార్మికుల శ్రమతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెంకటాపూర్ మండలం కేశవాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కూలీలతో కలిసి పనిలో పాల్గొన్నారు. కూలీలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని, కార్మికులకు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం గ్రామీణ పేదలకు ఎంతో దోహదపడుతోందని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను, మండల ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### మే డే వేడుకల్లో మంత్రి సీతక్క




**ములుగు:** కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో కార్మికులతో కలిసి మే డే వేడుకల్లో పాల్గొన్నారు. హమాలీ కూలీల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హమాలీ కార్మికులు, ములుగు ఏరియా ఆసుపత్రి కార్మికులు, ములుగు మున్సిపాలిటీ కార్మికులతో కలిసి కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి సేవలను కొనియాడారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి కార్మికుల శ్రమే మూలాధారమని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అసంపూర్తి పనులకు రూ.3 కోట్ల నిధులు

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా భోరజ్ మండలం రాంపూర్ (టి) గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన విన్నపాలను పరిశీలించి ప్రభుత్వ ఆదేశాల మేరకు పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. రాంపూర్ గ్రామంలోని 82 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే సుమారు రూ.80 లక్షలు ఖర్చు చేశామని చెప్పారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడానికి మరో రూ.3 కోట్ల నిధులు అవసరమని, దీనిపై ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు పేర్కొన్నారు. నిధులు మంజూరైన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని, వారు మిగిలిన పనులను పూర్తి చేసుకుని త్వరలోనే గృహప్రవేశాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టాల పంపిణీతో లబ్ధిదారులకు వారి ఆస్తిపై పూర్తి చట్టబద్ధ హక్కు లభించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ రాంపూర్ గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శవంతమైన పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో ఎదురైన సాంకేతిక సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం సానుకూల హామీ ఇచ్చిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, హౌసింగ్ నోడల్ అధికారి శంకర్, పంచాయతీరాజ్ ఈఈ శివరాం, తహశీల్దార్ రాజేశ్వరి, సర్పంచ్ వెంకటమ్మ, లబ్ధిదారులు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతులు మక్కలను మార్క్ ఫెడ్ కు విక్రయించడం ద్వారా మద్దతు ధరను పొందవచ్చు

### జిల్లా కలెక్టర్ హరిత



**కాగజ్ నగర్** : జిల్లాలో రైతులు తాము పండించిన మక్కలను మర్కెట్ ఫెడ్ కు విక్రయించడం ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందవచ్చని కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం కౌటాల మండల కేంద్రంలోని వ్యవసాయ గిడ్డంగి ఆవరణలో తెలంగాణ రాష్ట మార్క్ ఫెడ్ వారి ఆద్వర్యంలో ప్రాథమిక సహకార సంఘం గురుడు పేట ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి ఆదిలా బాద్ ఎం ఎల్ సి దండె విఠల్, సిర్పూర్ శాసన సభ్యులు, పాల్వాయి హరీష్ బాబు, అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం. డెవిడ్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ హరిత ప్రారంబించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్ లో ఎక్కువ మంది రైతులు మొక్క జొన్న పంటను సాగు చేశారన్నారు. రైతులు తాము పండించిన మొక్క జొన్న పంటను మార్కెట్ ఫెడ్ కు విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు.ఎం ఎల్. సి. దండె విఠల్, మాట్లాడుతూ ప్రభుత్వం మొక్క జొన్న పంటని మర్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని రైతులు తాము పండించిన పంటలను దళారులకు విక్రయించ కుండ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని అన్నారు. సిర్పూర్ శాసన సభ్యులు పాల్వాయి హరీష్ బాబు, మాట్లాడుతూ ప్రభుత్వం కౌటాల మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా వుందని తెలిపారు. ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో రైతులు మొక్క జొన్న పంటలను సాగు చేశారని రైతులు తాము పండించిన మొక్క జొన్న పంటను మార్క్ ఫెడ్ కు విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అనంతరం మండ లంలోని సాండ్ గాం గ్రామంలో సెర్ప్ అద్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి వరి ధాన్యము కొనుగోలు కేంద్రాన్ని ఉమ్మడి జిల్లా ఎం. ఎల్. సి దండె, విఠల్ సిర్పూర్ ఎం ఎల్ ఎ పాల్వాయి హరీష్ బాబు ,అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం. డెవిడ్, తో కలిసి కలెక్టర్ హరిత ప్రారంబించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సన్న రకం వరి ధాన్యం క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అందిస్తుందని, తెలిపారు. ఈ కార్యక్రమములో కాగజ్ నగర్ మార్కెట్ కమిటి చైర్మన్ సుద్దాల దేవయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్, సర్పంచులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ముఖ్యమంత్రి పర్యటన

## ప్రాణహిత బరాజ్ వద్ద ఏర్పాట్లను వేగవంతం చేయాలి



**కౌటాల :** కౌటాల మండలంలోని తుమ్మిడి హెట్టి గ్రామం వద్ద ప్రాణహిత నదిపై ప్రతిపాదిత బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ హరిత, జిల్లా ఎస్పీ నితికా పంత్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండె విఠల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బరాజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక వివరాలపై ఇరిగేషన్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. బరాజ్ నిర్మాణం ద్వారా ఎన్ని టీఎంసీల నీరు లభ్యమవుతుంది, ఎంత మేర ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు , ప్రాజెక్టు కారణంగా ఎన్ని ఎకరాల భూమి ముంపునకు గురవుతుంది వంటి కీలక అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు నీటి పారుదల శాఖ మంత్రి, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు నిపుణుల బృందం ఈ ప్రాంతాన్ని సందర్శించనున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రతిపాదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుద్దాల దేవయ్య, తహసీల్దార్ ప్రమోద్, ఎంపీడీఓ ప్రసాద్, ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ క్షేత్రాల అభివృద్ధికి ఉపాధి పథకం ఒక వరం

### జిల్లా కలెక్టర్ హరిత



**సిర్పూర్ (టి) :** ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు తమ వ్యవసాయ భూములను మరింత సారవంతం చేసుకోవచ్చని, ఈ పథకం గ్రామీణ ప్రాంత రైతాంగానికి ఒక వరమని జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలోని సిర్పూర్ (టి) మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న చేపల చెరువు (ఫిష్ పాండ్) పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారావుతో కలిసి ఆమె స్వయంగా సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా చేపల పెంపకం వంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ పథకం ద్వారా పనులు చేపట్టడం వల్ల రైతులకు ఎటువంటి ఆర్థిక భారం పడదని, కూలీల ద్వారా పనులు జరిగి భూగర్భ జలమట్టం కూడా పెరుగుతుందని ఆమె వివరించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీల రక్షణ కోసం అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పనులను ఉదయం 10 గంటల లోపు పూర్తి చేసేలా చూడాలని, పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించడంతో పాటు వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం కూలీలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, స్థానిక సర్పంచ్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో అలసత్వం వద్దు

- పీహెచ్‌సీల తనిఖీలో ఐటీడీఏ పీఓ మంద మకరంద



:ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరంద శుక్రవారం ఉదయం దంతనపల్లి, షాంపూర్ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రాలలోని వార్డులను సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ప్రస్తుతం అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన పీఓ, భవిష్యత్తులో రోగులకు మరింత మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీలో భాగంగా ఔషధ నిల్వలను పరిశీలించిన ఆయన, అత్యవసర మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మందుల నిల్వలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని స్పష్టం చేశారు. అలాగే, ఆసుపత్రి రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన, ప్రతి అంశాన్ని పారదర్శకతతో నమోదు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం దంతనపల్లి గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులు, ఇతర ప్రజా సమస్యలపై ప్రజల నుంచి వినతులను స్వీకరించిన ఆయన, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైద్య సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఆసిఫాబాద్ :** జిల్లాలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు మే 1 తేది నుండి 7 తేది వరకు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ కె. హరిత, డీఆర్వో లోకేశ్వర్ రావు, ఎస్ఈ ఉత్తమ్ జాడే కలిసి ఈ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం వీడి, ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి మీటర్లు, వైర్లు తనిఖీ చేయాలని, వంగిన స్తంభాలను సరిచేయాలని ఆదేశించారు. రైతులు మోటార్ స్టార్టర్ల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ లైన్ల వద్ద లోహపు పైపుల వాడకంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.

# మేడే పోరాట స్ఫూర్తితో లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం

- పీ డీ ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి



**ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లో 140వ మేడే వేడుకలను సిపిఐ (ఎమ్.ఎల్) న్యూడెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య (IFTU) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా PDSU ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి జెండాను ఆవిష్కరించి ప్రసం గించారు. 1886లో చికాగోలో ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులు యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచి, కార్మికులను కార్పొరేట్ శక్తులకు బానిసలుగా మారుస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం 30 వేల రూపాయలు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ మరియు స్కీం వర్కర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు పోరాటాన్ని ఉధృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ, IFTU మరియు PDSU నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపోలో ఘనంగా మే డే వేడుకలు



**ఆసిఫాబాద్ టౌన్ :** స్థానిక ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో ఏఐటీయూసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలను కార్మికులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల జెండాను డీఎం ఆవిష్కరించగా, ఎంప్లాయిస్ యూనియన్ జెండాను డిపో అధ్యక్షులు వేల్పుల అశోక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ జిల్లా అధ్యక్షురాలు సుగుణ, నియోజకవర్గ ఇన్చార్జి శ్యామ్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా బిన్ అహ్మద్ హాజరయ్యారు. వీరితో పాటు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు చిరంజీవి పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక హక్కుల రక్షణ కోసం, వారి సంక్షేమం కోసం సంఘటితంగా పోరాడాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక లోకానికి మే డే ఒక స్ఫూర్తిదాయకమైన రోజని, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భారీ సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

జిల్లా ఎస్పీ నితిక పంత్



**ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంత వాతావరణాన్ని కాపాడడంలో భాగంగా ఈ నెల 1వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం జిల్లాలో ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, ధర్నాలు, ర్యాలీలు లేదా ప్రజలు గుమికూడే కార్యక్రమాలు నిర్వహించరాదని ఆమె స్పష్టం చేశారు. ఏదైనా ప్రజా ప్రదర్శనలు లేదా సమావేశాలు నిర్వహించదలచిన వారు సంబంధిత డీఎస్పీ/ఏఎస్పీ లేదా పైస్థాయి పోలీస్ అధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని , అలాగే ఎవరూ కూడా నిషేధిత ఆయుధాలను లేదా నేరాలకు ప్రేరేపించేలా ఉండే ఎటువంటి పరికరాలను కలిగి ఉండరాదని, సాధారణ ప్రజానీకానికి ఇబ్బంది కలిగించేలా ఉండే ఎటువంటి సమావేశాలు నిర్వహించకూడదని ఎస్పీ సూచించారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న సమయంలో నిబంధనలను అతిక్రమించి అనుమతి లేకుండా ర్యాలీలు లేదా సభలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. జిల్లాలో ప్రశాంతతను కాపాడేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాలు పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

# ప్రణమ్ డే కేర్ సెంటర్‌లో భోజన సదుపాయం ప్రారంభం



**ఆసిఫాబాద్ :** స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రణమ్ డే కేర్ సెంటర్‌లో వయోవృద్ధుల కోసం భోజన సదుపాయాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. గత నెలలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ సెంటర్‌లో, వృద్ధులకు అవసరమైన అన్ని వసతులను కల్పించే క్రమంలో ఈ కీలక అడుగు వేశారు. సెంటర్ లోని వయసులో పెద్దవారైన సభ్యురాలు దండ నాయకుల హేమలత మొదటి భోజనాన్ని వడ్డించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం విశేషం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ డే కేర్ సెంటర్ ద్వారా వృద్ధులకు పౌష్టికాహారం, అల్పాహారం అందించడంతో పాటు వైద్య సేవలు , మానసిక ఉల్లాసం కోసం క్రీడలు వంటి సదుపాయాలను కల్పించడమే ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనిట్ అధ్యక్షులు కర్ణ గౌడ్, తాలూకా యూనిట్ అధ్యక్షులు వైద్య వెంకన్న, సిరాజుల్ హక్, ఇతర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుమారు 30 మంది వయోవృద్ధులు భోజనాన్ని ఆస్వాదిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. తమ సంక్షేమం కోసం ఇలాంటి సేవలు అందుబాటులోకి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

# కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం

- ఓంకార్ భవన్లో ఘనంగా మేడే వేడుకలు
- ఎర్రజెండా ఆవిష్కరించిన ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి



**హైదరాబాద్:** కార్మికుల హక్కుల సాధనే మా లక్ష్యమని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. 140వ అంతర్జాతీయ మేడే వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్ బాగ్లింగంపల్లిలోని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యాలయం ఓంకార్ భవన్ వద్ద శుక్రవారం ఎర్రజెండాను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ వద్య తుకారాం నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అందరు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో పని గంటల తగ్గింపు, తగిన వేతనాల కోసం కార్మికులు చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. హే మార్కెట్ ఘటనలో కార్మికులపై జరిగిన కాల్పులు, నాయకులను ఉరితీయడం వంటి అణచివేతల మధ్య కూడా ఉద్యమం విజయవంతమై 8 గంటల పని విధానం సాధించబడిందని గుర్తు చేశారు. 1889 నుంచి మే 1ను ప్రపంచ కార్మికవర్గ పోరాట దినంగా జరుపుకుంటున్నామని, నేటి కార్మిక వర్గం కూడా అదే స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్లుగా కుదించి అమలు చేయాలని ప్రయత్నించడం కార్మిక వ్యతిరేక చర్య అని విమర్శించారు. దేశ సంపదలో ఒక శాతం మంది 60 శాతం సంపదను అనుభవిస్తున్నారని, పేద-ధనిక అంతరాలు పెరుగుతున్నాయని అన్నారు. ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ఆత్మహత్యలు పెరుగుతున్న పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, నాయకులు తుకారాం నాయక్, ఎ.లక్ష్మణ్, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందడంతో పాటు పట్టణ పరిశుభ్రత కూడా అంతే ముఖ్యమని, ఇందుకోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ తమ బాధ్యత అని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. మేడేను పురస్కరించుకొని శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్తో కలిసి కార్మికులకు నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ సొంత నిధులతో కొనుగోలు చేసిన సబ్బులు, నూనె, బెల్లం, చెప్పులు, గ్లౌజులు కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ మేడే అంటే కార్మికులకు కేవలం సెలవు దినం మాత్రమే కాదని, వారి సంక్షేమం గురించి ఆలోచించాల్సిన రోజని పేర్కొన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, అందులో భాగంగానే ఈ సామగ్రిని అందజేస్తున్నామని తెలిపారు. కార్మికులు కూడా తమ బాధ్యతగా పట్టణాన్ని మరింత శుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని కోరారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం, మున్సిపాలిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే రాగమయి దయానంద్



**సత్తుపల్లి:** కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. నియోజకవర్గంలోని కిష్టారం ఓసి పరిధిలో గల మహాలక్ష్మి క్యాంప్లో సింగరేణి ఓబీ కార్మికులతో కలిసి మేడే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల జెండాను ఆవిష్కరించారు. అలాగే సత్తుపల్లి పట్టణంలోని వేంసూరు రోడ్డులో తాపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొని పట్టణ, మండల తాపీ కార్మికులతో కలిసి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తాపీ వర్కర్స్ యూనియన్ భవన ఆధునీకరణ కోసం సత్తుపల్లి మున్సిపాలిటీ ద్వారా రూ.3.50 లక్షల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల శ్రమే దేశ సంపదకు మూలమని, తమ కష్టంతో సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తూ దేశ పురోగతికి బాటలు వేస్తున్నారని అన్నారు. అన్ని శ్రామికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల ఆరోగ్యం, భద్రత, సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కవచంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్పాషా, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కిష్టారం గ్రామ సర్పంచ్ నరకళ్ళ రాజేశ్వరి అప్పారావు, మహాలక్ష్మి క్యాంప్ యాజమాన్యం, ఓబీ కార్మికులు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, తాపీ వర్కర్స్ యూనియన్ సభ్యులు, మహిళలు, కార్మికులు పాల్గొన్నారు.

# నేరడిగొండలో చలివేంద్రం ప్రారంభం




**నేరడిగొండ:** రోజురోజుకు తీవ్రమవుతున్న ఎండల దృష్ట్యా మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, ప్రయాణికుల తాగునీటి కష్టాలను తీర్చడానికి నేరడిగొండ గ్రామపంచాయతీ ముందడుగు వేసింది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, వార్డు సభ్యులు సాబ్లే కవిత సంతోష్ సింగ్, కౌసర్ తోహెద్, గ్రామపంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ స్వచ్ఛతలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిది



**నేరడిగొండ:** గ్రామ స్వచ్ఛతలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని నేరడిగొండ గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి అన్నారు. మేడేను పురస్కరించుకొని శుక్రవారం గ్రామ పంచాయతీ కార్మికుల గౌరవార్థం సర్పంచ్ తన నివాసంలో ప్రత్యేక విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నిత్యం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్యం కోసం శ్రమిస్తున్న కార్మికులను ఈ సందర్భంగా సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ స్వయంగా కార్మికులతో కలిసి విందు ఆరగించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో, ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. వారి శ్రమను గుర్తించి గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి ఇప్ప నర్సారెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. కార్మికుల పట్ల సర్పంచ్ చూపిన ఆత్మీయతపై గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

# వెంకటాపురంలో ఘనంగా మేడే వేడుకలు



**సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో మేడేను సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్షులు షేక్ బాజీ జెండాను ఆవిష్కరించి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పోరాటాల ప్రాధాన్యతను వివరించారు. మేడే సందర్భంగా కార్మికుల త్యాగాలను స్మరించుకుంటూ వారి హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దోస సత్యనారాయణ, భాషా, రత్నాచారి, శ్రీనివాసచారి, రాము, వెంకటేశ్వరరావు, సర్వేశ్, నాగులు మీరా, సీఐటీయూ నాయకులు, టాపీ వర్కర్లు, కార్పెంటర్ వర్కర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



**• జూనియర్ సివిల్ జడ్జి కే.సందీప్**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ (బోథ్):** కార్మికులు తమ హక్కులతో పాటు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కే.సందీప్ అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బోథ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కార్మికులు శ్రమ దోపిడీకి గురికాకుండా రోజువారీ పని గంటలు 8 మాత్రమే ఉండాలని సూచించారు. ప్రతి కార్మికుడు కుటుంబ సభ్యులతో కలిసి లేబర్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని, ఆపద సమయంలో అది రక్షణగా నిలుస్తుందని తెలిపారు. ఆరోగ్యం, భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత, కార్మికులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. అనంతరం న్యాయ సేవలు అందిస్తున్న జడ్జి సందీప్ను సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు కుమ్మరి విజయ్ కుమార్, దమ్మాపాల్, ఈఓ అంజయ్య, వార్డు సభ్యులు కట్టా భూమేష్, సాయి, పీసీ సోయం అంబాజీ, లీగల్ సర్వీసెస్ ప్రతినిధులు స్రవంతి, సంగీత, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల సంరక్షణలో అలసత్వం వహిస్తే చర్యలు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్:** పిల్లల సంరక్షణ అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శిశు గృహంలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వసతులు, చిన్నారుల ఆరోగ్యం, వ్యక్తిగత పరిస్థితులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శిశు గృహంలోని చిన్నారులకు మెరుగైన భవిష్యత్తును అందించడంలో దత్తత ప్రక్రియ అత్యంత కీలకమని పేర్కొన్నారు. అర్హులైన పిల్లలను చట్టపరమైన నిబంధనల ప్రకారం సకాలంలో దత్తత పంపించేలా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారిణిని ఆదేశించారు. ముఖ్యంగా దివ్యాంగులైన చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. చిన్నారుల సంరక్షణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాలలకు కలెక్టర్ క్రీడా వస్తువులను పంపిణీ చేశారు. అలాగే చిన్నారులకు సేవలందిస్తున్న సిబ్బందిని శాలువాతో సత్కరించి, వారికి నూతన వస్త్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, పంచాయతీరాజ్ ఈఈ శివరాం, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, బాలల సంరక్షణ అధికారి స్వామి, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ కుట్ల రమేష్, మేనేజర్ విజయలక్ష్మి, సోషల్ వర్కర్ స్వప్న, ఏఎన్ఎం, డీసీపీయం సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రామిక హక్కులు హరించే పాలకులకు మేడే జరిపే నైతికత లేదు



**హన్మకొండ:** శ్రామికుల హక్కులను హరించే పాలక పార్టీలు మేడే వేడుకలు నిర్వహించడం సిగ్గుచేటని ఎంసిపిఐ(యు) హన్మకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మాస్ సావిత్రి విమర్శించారు. దోపిడి రహిత సమాజ నిర్మాణం, ప్రపంచ శాంతి కోసం పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా ఎర్రజెండా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా ఎంసిపిఐ(యు) పలువెల్పుల భీమారం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక హక్కులను పాలకులు కాలరాస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను మార్చి కార్మికులను దోపిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రైతులకు గిట్టుబాటు ధరలు లేక మార్కెట్ దోపిడీ పెరిగిందన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి కూలీల ఉపాధిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మే డే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేపట్టి రైతుల పంటలకు మద్దతు ధర, రుణ విముక్తి, కార్మిక చట్టాల పరిరక్షణ, ఉపాధిహామీ చట్టం కొనసాగింపుకు ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున, పార్టీ సభ్యులు అన్నబోయిన ప్రేమలత, కళావతి, సుజాత, కుమార్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**మేడే వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని**



**హనుమకొండ:** కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొని కార్మిక జెండా ఎగురవేశారు. కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మొదటగా హనుమకొండ డిపో-1లో ఆర్టీసీ కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్తో కలిసి హాజరయ్యారు. అనంతరం వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జెండా ఆవిష్కరించారు. అలాగే కాజీపేట 47వ డివిజన్ పరిధిలో ఆల్ యూనియన్ అసోసియేషన్ నిర్వహించిన కార్మిక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వేగంగా స్పందించి మంత్రివర్గ సమావేశం ద్వారా పరిష్కార చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణాన్ని కొంత మంది రాజకీయ పార్టీలు స్వార్థ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని విమర్శించారు. ఆ కుటుంబానికి నిజమైన అండగా నిలిచింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ప్రతి కార్మికుడికి అండగా ఉంటూ, కష్టకాలంలో ఒక సోదరుడిలా పక్కన ఉంటానని భరోసా కల్పించారు. కాజీపేట ప్రాంత కార్మికుల కోసం భవన నిర్మాణానికి ఇప్పటికే స్థలం కేటాయించినట్లు తెలిపారు. అదనంగా ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసి భవన నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# కార్మికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**




**ఆదిలాబాద్:** కార్మికులు తమ హక్కులతో పాటు కార్మిక చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని ద్వారకానగర్లో గల మేస్త్రి సంఘ భవనంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా భవన నిర్మాణ, అసంఘటితరంగ కార్మికుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. దేశాభివృద్ధికి చెమటోడ్చి శ్రమిస్తున్న ప్రతి కార్మికునికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే వారి కుటుంబాలను ఆదుకునేందుకు బీమా సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే కార్మికులకు శిక్షణ అందిస్తున్న పలువురు సిబ్బందికి ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ దాసరి గంగారాం, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రాజేశ్వరి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చందన్ కుమార్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, ఐటీఐ ఏటీఓ ఆర్.శ్రీనివాస్, మేస్త్రి సంఘం నాయకులు బండారి పోశన్న, సామల సత్యనారాయణ, రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, మేస్త్రిలు, కార్మికులు పాల్గొన్నారు.

# పాత మొబైల్ ఫోన్ల పేరిట సైబర్ మోసాలు

**నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల రిమాండ్**





**ఆదిలాబాద్:** పాత మొబైల్ ఫోన్ల వ్యాపారం ముసుగులో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్లోని ముజఫర్నగర్ జిల్లాకు చెందిన అస్ మహమ్మద్, అర్షద్, మహబూబ్ అలీ, దిన్ మహమ్మద్లు ముఠాగా ఏర్పడి ఈ అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 30న రాత్రి 11.30 గంటల సమయంలో ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలోని మహమ్మదీయ లాడ్జ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, బ్యాగులతో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఈ నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించగా, పనిచేయని కీప్యాడ్ ఫోన్లు, మదర్బోర్డులు, బ్యాటరీలు, అనేక ఎలక్ట్రానిక్ చిప్పు లభించాయని పేర్కొన్నారు. విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. నిందితులు ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ పాత ఫోన్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని విడదీసి విడిభాగాలను వేరు చేసినట్లు చెప్పారు. కేవలం విడిభాగాల విక్రయమే కాకుండా, ఆ ఫోన్లలోని ఐఎంఈఐ నంబర్లు, కస్టమర్ల వ్యక్తిగత డేటాను సేకరించి సైబర్ నేరాలకు వినియోగిస్తున్నట్లు వివరించారు. సేకరించిన డేటా ఆధారంగా బ్యాంకు అధికారులుగా నటిస్తూ బాధితులకు ఫోన్లు చేసి, ఓటీపీలు సేకరించి వారి ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రియల్ మీ 12 5G, శాంసంగ్ A20, మోటో G9, గెలాక్సీ A14 5G వంటి స్మార్ట్ఫోన్లతో పాటు భారీగా మొబైల్ విడిభాగాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, కోర్టు వారికి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. పాత ఫోన్లను విక్రయించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్సై అశోక్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం



**తాండూర్:** కార్మికుల హక్కులను హరిస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై మేడే స్ఫూర్తితో పోరాడుదామని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం పిలుపునిచ్చారు. శుక్రవారం 140వ మే డే వారోత్సవాల సందర్భంగా తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ వద్ద సీఐటీయూ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో కార్మికులు ఎనిమిది గంటల పని దినం కోసం చేసిన పోరాటం చరిత్రాత్మకమని అన్నారు. ఆ పోరాటంలో వేలాది మంది కార్మికులు పోలీస్ కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాల ఫలితంగానే కార్మికులకు అనేక హక్కులు, చట్టాలు లభించాయని పేర్కొన్నారు. కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం పాత కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని విమర్శించారు. దీంతో ఎనిమిది గంటల పని దినం, సమ్మె హక్కు, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు ప్రమాదంలో పడుతున్నాయని అన్నారు. ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ ద్వారా శాశ్వత ఉద్యోగాలను తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. తెలంగాణలో కూడా కార్మికులకు అనుకూలంగా కాకుండా పని గంటలు పెంచే విధానాలు అమలు చేస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మేడే ఇచ్చిన హక్కులను కాపాడుకునేందుకు కార్మిక ఉద్యమాలను బలోపేతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లీలరాణి, సత్యవతి, కె.విజయలక్ష్మి, ఎం.విజయలక్ష్మి, తిరుమలేశ్వరి, మగ్దూం, లత, లక్ష్మి, శ్యామల, ధనలక్ష్మి, ప్రమీల, జి.విజయలక్ష్మి, వెంకన్న, దుర్గం నానయ్య, వెంకటి, అశోక్, కార్మికులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా మేడే



**సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణం, మండలంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 141వ మే డే ఉత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. వివిధ కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని కార్మికుల ఐక్యతను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా కార్మికులు జెండా ఆవిష్కరణ చేసి, తమ హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటిత శక్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే సత్తుపల్లి మండలంలోని తుంబూరు గ్రామంలో హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, గంగారం ప్రాంతంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిపారు. కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, సీపీఐ మండల కార్యదర్శి తడికమల్ల యోబు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఆర్టీసీ డిపో సెక్రటరీ రాంబాబు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు షేక్ రహంతుల్లా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నకరికంటి నాగరాజు, నరసింహారావు, బుగ్గ సుధాకర్, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఏచూరి అప్పారావు, చింతల వెంకటేశ్వరావు, గంగారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కనపర్తి మాల్యాద్రి, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వాసు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ కాశీరావు, కేశవరావు, వీరయ్య, రాజశేఖర్, లక్ష్మణరావు, సైదులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు, కమ్యూనిస్టు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని
- గంభీరావుపేటలో జామే మస్జీద్ కమర్షియల్ కాంప్లెక్స్కు శంకుస్థాపన



**గంభీరావుపేట:** మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని అన్నారు. శుక్రవారం నమాజ్ అనంతరం ఆయన స్వగ్రామమైన గంభీరావుపేటలో జామే మస్జీద్ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మస్జీద్ అనేది కేవలం ప్రార్థన స్థలం మాత్రమే కాకుండా సామాజిక, మతపరమైన కార్య కలాపాల కేంద్రంగా కూడా ఉంటుందని పేర్కొన్నారు. మస్జీద్ అవసరాలను తీర్చడానికి స్థిరమైన ఆదాయం ఎంతో ముఖ్యమని, అందుకే కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం తెలంగాణ వక్ఫ్ బోర్డు తరపున రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైనారిటీ వ్యవహారాల మంత్రి మహమ్మద్ అజహారుద్దీన్కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి కట్టుబడి ఉందని, వక్ఫ్ ఆస్తులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా మత సంస్థలను బలోపేతం చేయడంతో పాటు సమాజ ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే జామే మస్జీద్ పునరుద్ధరణ పనులు కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పాడైపోయిన మినార్లను మరమ్మతు చేసి, ఆధునిక నిర్మాణ శైలితో పాటు సాంప్రదాయ ఇస్లామిక్ శైలిలో అభివృద్ధి చేస్తామని అన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ పూర్తయిన తర్వాత మస్జీద్కు ఆర్థిక స్థిరత్వం లభించడమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మహబూబ్ అలీ, సయ్యద్ గాజీద్దీన్ జుబేర్, మహ్మద్ యాహ్యా అస్లం, హమీదుద్దీన్ ఖాలిద్, సయ్యద్ నజ్ముద్దీన్, మహ్మద్ వకీల్ మౌలవి, సయ్యద్ అసఫ్ అలీ సాదాత్, సయ్యద్ హాషిమీ యాసిన్ హుస్సేన్, మహ్మద్ షోయబ్, మహ్మద్ తాహిర్, మహ్మద్ రహీముద్దీన్, మహ్మద్ అజ్మద్దీన్, మహ్మద్ ఆమిర్, మహ్మద్ అర్మాన్, మహ్మద్ తురాబ్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్పర్సన్ను కలిసిన నూతన కమిషనర్




**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ గా జగదీష్ గౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్పర్సన్కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలపై చర్చించారు. పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గం, అధికారుల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలి

**జిలాల అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**




**మంచిర్యాల:** విద్యార్థి దశ నుంచే సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకొని నూతన ఆవిష్కరణల దిశగా తమ మేధస్సును అభివృద్ధి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గల జిల్లా సైన్స్ కేంద్రంలో జిజ్ఞాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి సైన్స్ శిబిరాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్తో కలిసి సందర్శించారు. ప్రయోగాల బోధన తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న వేసవి సైన్స్ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, జిల్లా సైన్స్ కార్యక్రమాలకు రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే అనేక కార్యక్రమాల్లో జిల్లా విద్యార్థులు పాల్గొనడం గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లా సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో జిజ్ఞాస మొబైల్ వ్యాన్ ద్వారా జిల్లాలోని పాఠశాలల్లో ప్రయోగాలు నిర్వహిస్తూ విద్యా సంవత్సరం పొడవునా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా సైన్స్ ప్రయోగాలపై అవగాహన పెంచుకొని ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు నిర్వహించిన పలు ప్రయోగాలను ఆసక్తిగా వీక్షించిన విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, కొప్పుల తిరుపతి, రాజేశం, శ్రీమూర్తి, శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రంలో అదనపు కలెక్టర్ పరిశీలన



- గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో రైస్ మిల్లుల తనిఖీ

**గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా ధాన్యం కుప్పలు, రైతులకు కల్పించిన వసతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు ఎంత మేరకు ధాన్యం వచ్చిందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్, ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్లోని శ్రీ సాయి ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ధాన్యం దిగుమతి, నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ తదితర అంశాలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వెంటనే దించి, లారీలను త్వరితగతిన పంపించాలని మిల్లర్లకు సూచించారు. ఆయన వెంట తహశీల్దార్లు మారుతి రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పథకాల అమలు

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల:** కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మే డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేడే ప్రతి కార్మికుడు గర్వపడాల్సిన రోజని అన్నారు. జిల్లాలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో ప్రమాదవశాత్తు మరణించిన 102 మంది కార్మికుల కుటుంబాలకు సుమారు రూ.60 కోట్లు, సహజ మరణం పొందిన 223 మంది కుటుంబాలకు రూ.24 కోట్లు, వివాహ ప్రోత్సాహకంగా 993 మందికి రూ.30 కోట్లు, ప్రసూతి ప్రోత్సాహకంగా 1,646 మందికి రూ.49 కోట్లు అందించినట్లు వివరించారు. దివ్యాంగులైన కార్మికులకు కూడా ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2 నుంచి 10 వరకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బాల కార్మికులపై వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందిస్తున్నామని చెప్పారు. నైపుణ్యం లేని కార్మికులకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలు, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, ఐటీఐల ద్వారా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, భద్రత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాకు త్వరలో ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అసంఘటిత కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు అందించే ఆర్థిక సహాయాన్ని రూ.15 లక్షలకు పెంచేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన వారికి అవార్డులు అందజేశారు. అలాగే జిల్లాలోని 16 మండలాలకు ఉపాధి హామీ పనుల నిర్వహణ కోసం మంజూరైన కంప్యూటర్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ దుర్గం క్రాంతి, వివిధ శాఖల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబులెన్స్లో గర్భిణీ ప్రసవం

- సమయస్ఫూర్తితో తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



**గంభీరావుపేట:** గంభీరావుపేట మండలంలో 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి ఓ గర్భిణికి సురక్షితంగా ప్రసవం జరిపించి ప్రాణదాతలుగా నిలిచారు. గజసింగారం గ్రామానికి చెందిన సంపంగి హరీషకు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. అంబులెన్స్లో ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో మార్గ మధ్యలోనే నొప్పులు తీవ్రమవడంతో పరిస్థితి విషమంగా మారింది. ఈ నేపథ్యంలో ఈఎంటీ చెలిమెల సాయికృష్ణ, పైలట్ మనోజ్ కుమార్ చాకచక్యంగా స్పందించి అంబులెన్స్లోనే ప్రసవం నిర్వహించారు. హరీష పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా, తల్లీబిడ్డలు ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అనంతరం వారిని మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి తల్లీబిడ్డలను కాపాడిన 108 సిబ్బందిపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రశంసల వర్షం కురిపించారు.

# రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక సభ్యత్వ నమోదు



**మంచిర్యాల:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు పి. చంద్రయ్య తెలిపారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో అదనపు కలెక్టర్ ఛాంబర్లో రాజేంద్ర ప్రసాద్ను రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడిగా నమోదు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సభ్యత్వ డ్రైవ్ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులుగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నోడల్ అధికారిగా జిల్లా కార్మిక శాఖ సహాయ సంచాలకులను నియమించినట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ అయిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు తమ సభ్యత్వాన్ని స్వయంగా https://redcross.cgg.gov.in/index వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. అలాగే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గల రెడ్ క్రాస్ జిల్లా కార్యాలయానికి వెళ్లి సభ్యత్వం పొందవచ్చని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ అందించే సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో ఘనంగా మే డే



**తాండూర్:** తాండూర్ మండల ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో శుక్రవారం మే డే దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన నాయకులు, కార్మికులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా బీఆర్టీయూ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు జరిగాయని, 18 గంటల పని విధానాన్ని 8 గంటలకు తగ్గించేందుకు అనేక మంది చేసిన త్యాగాల ఫలితమే మేడే అని అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం బీఆర్టీయూ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని తెలిపారు. చికాగో పోరాటంలో ప్రాణాలు అర్పించిన కార్మికులకు నివాళులర్పించారు. ముద్దం రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆటో కార్మికుల జీవనోపాధి సంక్షోభంలో పడిందని, ఇప్పటికైనా ప్రభుత్వం వారి సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం..

**ఈజీఎస్ ఏపీవో సస్పెన్షన్**

**తాండూర్:** తాండూర్ మండల ఈజీఎస్ ఏపీవో ఎస్.నందకుమార్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఇతర ఉద్యోగులు, ఉన్నతాధికారులతో దురుసుగా ప్రవర్తించడం పట్ల క్రమశిక్షణ చర్యగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎస్.కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు క్షేత్రస్థాయి పనులకు క్రమం తప్పకుండా హాజరు కావడం లేదని పేర్కొన్నారు. దీని ప్రభావంతో మండలంలోని గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ కూలీల హాజరు తగ్గిపోయిందని తెలిపారు. తన ప్రవర్తన, పనితీరును మెరుగుపరుచుకోవాలని పలుమార్లు సూచించినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదని వివరించారు. దీంతో పరిపాలన అవసరాల దృష్ట్యా సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సత్యనారాయణ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఎంసీసీ తాండూర్ను అదనపు కార్యక్రమ అధికారి ఎంసీసీ తాండూర్ పోస్టుకు ఇన్చార్జిగా నియమించినట్లు పేర్కొన్నారు.

# పదో తరగతిలో సత్తా చాటిన విద్యార్థికి సన్మానం



**సొనాల:** చదువుతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యదర్శి లోలపు పోశెట్టి అన్నారు. సొనాల మండలం పార్డి (కె) గ్రామ సర్పంచ్ చౌహాన్ వినోద్ కుమారుడు చౌహాన్ స్మరణ్ సింగ్ పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచినందుకు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న స్మరణ్ సింగ్ ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 574 మార్కులు సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చారు. ఈ సందర్భంగా లోలపు పోశెట్టి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు పడే కష్టాన్ని గుర్తించి విద్యార్థులు చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు జుంగాల భోజన్న, సొనాల సర్పంచుల సంఘం అధ్యక్షులు చౌహాన్ వినోద్, చింతల్ బోరి సర్పంచ్ శ్రీరామ్, కాంగ్రెస్ నాయకులు మునేశ్వర్ సోమన్న, భీంరావు పాటిల్, జి.భోజరాజు తదితరులు పాల్గొన్నారు.




# సమాజ సేవలో మమేకమైన పద్మజా నాయుడు

## నేడు పద్మజా నాయుడు వర్ధంతి

**పద్మజా నాయుడు (నవంబర్ 17, 1900 -- మే 2, 1975) స్వాతంత్ర్య సమర యోధురాలు, కవయిత్రి, సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ గా పని చేసిన మహిళ. ఆమె హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సంయుక్త వ్యవస్థాపకురాలు. పురుషుల ఆధిపత్య ప్రజా రంగంలో, సామాజిక సేవకురాలిగా, రాజకీయ నాయకురాలిగా, పాలకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు.**

పద్మజా నాయుడు 1900 నవంబర్ 17న హైదరాబాద్‌లో జన్మించారు. ఆమె (బెంగాలీ) తల్లి ప్రఖ్యాత కవి, భారత స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజిని నాయుడు. ఆమె (తెలుగు) తండ్రి ముత్యాల గోవిందరాజులు నాయుడు వైద్యుడు. ఆమెకు జైసూర్య, లీలమణి, ఆదిత్య, రణధీర అనే నలుగురు తోబుట్టువులు.

**పద్మజా నాయుడు పెద్దగా చదువు కోలేదు. చిన్ననాడు చేరిన మహబూబియా బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగేళ్ళు మాత్రమే చదివారు. బాల్యంలో తరుచుగా అనారోగ్యానికి గురికావడంతో ఆమె చదువు సరిగా సాగలేక పోయింది. ఆమె నేర్చుకున్న విద్య, సంస్కారం అంతా తన తల్లి వివాసమైన గోల్డెన్ థ్రెషోల్డ్‌కు వచ్చి పోయే వారి మధ్యే సాగి పోయింది.**

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వర్క్స్ శాఖను ఏర్పాటు చేసి ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణకై ఆమె ఎంతో మంది ముస్లిం స్త్రీలను సభ్యులుగా చేర్చుకొని ప్లేగు రిలీఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. పౌరుల స్వేచ్ఛ కొరకు, జాగిర్దారీ వ్యవస్థకు వ్యతిరేకంగా స్థాపించ బడిన స్వదేశీ లీగ్ అనే సంస్థకు అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే, ఆమె తన సంపాదకత్వంలో 'వన్ వరల్డ్' అనే పత్రికను నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సామ్యవాద సిద్ధాంతానికి ప్రభావితులైన కొందరు ఉస్మానియా విద్యార్థులు కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించగా, సంస్థకు పద్మజా నాయుడు సహకారాన్ని అందించారు. 1935లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడి నప్పుడు, రైతుల దుర్భర పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి ఏర్పడిన హైదరాబాద్ సహాయక సంఘానికి ఆమె అధ్యక్షురాలుగా వ్యవహరించారు. అనేక ప్రాంతాలు పర్యటించి, భాధితులకు తక్షణ సహాయం అందేలా ఏర్పాట్లు చేశారు.

**1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. అప్పటికి మహిళలకు ప్రత్యేకమైన జైళ్ళు లేకపోవడం, పలుకుబడి కలిగిన కుటుంబానికి చెందిన వారు కావడం మూలాన ఆమెను హయత్ నగర్ లోని బేగం గారి దేవిడిలో సకల సౌకర్యాలు కలిగిన రాజభవనంలో నిర్బంధించారు. దానికి ఆమె సంతోషించక తనతో పాటు అరెస్ట్ అయిన తక్కిన మహిళలకు ఎందుకు ఆ వసతులు కల్పించలేదని ప్రశ్నించారు. చైనా యుద్ధ సమయంలో ఆమె తనకున్న విలువైన బంగారు ఆభరణాలను నేషనల్ డిఫెన్స్ ఫౌండేషన్ కు సమర్పించారు. భారతదేశం నుండి " క్రమబద్ధమైన బ్రిటీష్ ఉపసంహరణ" కోరుతూ మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఖాదీ గురించి గాంధీ సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసేందుకు, విదేశీ వస్తువులను బహిష్కరించడానికి కృషి సల్పారు.**

పద్మజా నాయుడు భారత రాజ్యాంగ సభకు 1950 లో ఎన్నికై రెండేళ్ళు ఆ పదవిలో కొనసాగారు. ఆ తరువాత ఆమె 1956 నుండి 1967 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పనిచేశారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా తల్లితో పాటు పనిచేసిన పద్మజ, 21 యేళ్ల వయసులోనే హైదరాబాదులో భారత జాతీయ కాంగ్రెస్ సహ వ్యవస్థాపకురాలు అయ్యారు. స్వాతంత్ర్యానంతరం పద్మజా నాయుడు పార్లమెంటుకు ఎన్నికైనారు. కానీ అనారోగ్యం వల్ల రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తరువాత పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పని చేశారు. అర్ధ శతాబ్దానికి పైగా ఉన్న ఆమె ప్రజా జీవితంలో, స్వచ్ఛంద సేవలో ఔత్సాహికురాలై, ఆమె మానవ సంక్షేమ నిర్దేశిత, అంతర్జాతీయ మానవతా సంస్థ రెడ్‌క్రాస్ సొసైటీ తో సంబంధం కలిగి ఉండేది. బంగ్లాదేశ్ శరణార్థుల సహాయచర్య లప్పుడు భారత రెడ్ క్రాస్ సంస్థ ఛైర్ పర్సన్ గాను పని చేసి, ప్రముఖ పాత్ర పోషించారు. పద్మజా నాయుడుకు భారత్ సేవక్ సమాజ్, అఖిల భారత హస్తకళల బోర్డు, నెహ్రూ స్మారక నిధి వంటి సంస్థలతో అనుబంధం ఉండేది.

**పద్మజ తన కవితా సంకలనం "ది ఫెదర్ ఆఫ్ డాన్" పేరుతో 1961లో ప్రచురించారు. 1975లో పద్మజా నాయుడు స్మృత్యర్థం డార్జిలింగులోని జంతు ప్రదర్శన శాలను పద్మజా నాయుడు హిమాలయ జంతు ప్రదర్శన శాలగా మార్చగా, నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ ప్రారంభోత్సవం చేశారు. పద్మజా నాయుడు తన తల్లి (సరోజిని నాయుడు) నివాసం ది గోల్డెన్ థ్రెషోల్డ్‌ను 1970 లలో హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి (యుఒహెచ్) అప్పగించారు.**

భారతజాతికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆమెకు పద్మవిభూషణ్ పురస్కారం లభించింది. పద్మజా నాయుడు 1975 మే 2 న పరమపదించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# సినిమాల్లో సఫలం వైవాహిక జీవితంలో విఫలం

## సావిత్రి లాగే దేవిక జీవితం దుఖాంతం

### నేడు అలనాటి అందాల నటి దేవిక జయంతి

**సినిమా పరిశ్రమలో చాలామంది కథానాయికలు తమ అంద చందాలతో, గ్లామర్ తో, హావ భావాలతో, శారీరిక సౌష్టవంతో నటనతో రాణించి, ప్రేక్షకుల హృదయాలను దోచి, చిత్రాలను బాక్సాఫీస్ రికార్డులపరం చేసి, నిర్మాతలకు ఊహించని డబ్బులు సంపాదించి పెట్టారు. అయితే కొందరు అదే సమయాలలో, కారణాలు ఏవైనా, మహానటి సావిత్రి లాగా తమ వైవాహిక జీవితంలో చేసిన తప్పుల కారణంగా భారీగా మూల్యం చెల్లించుకున్న ఘటనలను కూడా ఇప్పటివరకు లేక పోలేదు. అలాంటి కొద్దిమంది అభాగినులలో అలనాటి మేటి నటి దేవిక ఒకరు.**

**దేవిక (1943 - మే 2, 2002) ఒకనాటి తెలుగు సినిమా బిజీ నటి. 1960, 70 దశకాలలో అందాల తారగా తెలుగు, తమిళ సినీరంగాలలో వెలుగొందింది. తెలుగు, తమిళ, మలయాళంలలో 150కి పైగా సినిమాలలో నటించింది. చిత్తూరు జిల్లా చంద్రగిరి ప్రాంతానికి చెందిన దేవిక అసలు పేరు ప్రమీలాదేవి.**

ఎన్టీస్ రామారావుతో కథానాయిక గా రేచుక్క అనే సినిమాలో తొలిసారి నటించింది. అత్తా ఒకింటి కోడలే, కంచుకోట, ఆడ బ్రతుకు సినిమాలు ఆమెకు ఎంతో గుర్తింపు తెచ్చి పెట్టాయి. ఎన్.టి.రామారావు నిర్మించిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర సినిమాలో చివరి సారిగా నటించారు. ఆమె తెలుగు సినిమాకు ఆద్యునిగా భావించే రఘుపతి వెంకయ్య బంధువు.

**మొదట రంగస్థల నటిగా జీవితాన్ని ప్రారంభించిన దేవిక ఎస్.వి.సహస్రనామం బృందం ప్రదర్శించిన అనేక నాటకాలలో వివిధ పాత్రలు పోషించింది. ముక్తా శ్రీనివాసన్ దర్శకత్వం వహించిన ముదలలిలో నటించిన తర్వాత దేవిక సినీరంగంలో ప్రాచుర్యం పొందింది. ఆ సమయంలోనే ఈమె అందానికి, నటనకు ముగ్ధులైన సినీరంగానికి చెందిన కొందరు దేవికకు పిలిచి సినీ అవకాశాలు ఇచ్చారు.**

ఈమె ఎన్టీ రామారావుతో హీరోయిన్‌గా 'రేచుక్క' అనే సినిమాలో తొలిసారి నటించింది. ఆ తర్వాత తెలుగు, తమిళ, మలయాళంలలో 150కి పైగా సినిమాలలో నటించింది. 1960, 70 దశకాలలో అందాల తారగా తెలుగు, తమిళ సినీరంగాలలో వెలుగొందింది.

**అయితే అప్పట్లో నటి దేవిక తెలుగు, తమిళ భాషలలోని స్టార్ హీరోలతో వరుస చిత్రాలతో నటిస్తూ బాగానే రాణించింది. దీంతో తెలుగు, తమిళంలో బాగా పేరొందిన ఓ స్టార్ హీరోయిన్ దేవిక కు సినిమా అవకాశాల విషయంలో అడ్డు పడుతున్నారని అప్పట్లో టాక్ వినిపించింది.**

అయితే ఎందరికో సినీ పరిశ్రమలో చేయూ తను అందించిన నందమూరి తారక రామా రావు... మాత్రం దేవికకు దాదాపుగా తెలుగులో 20 కి పైగా చిత్రాలలో నటించే అవకాశాలను ఇప్పించారు. అంతగా వీరిద్దరి మధ్య చాలా సాన్నిహిత్యం ఉండేదని అప్పట్లో అంటుండేవారు. అయితే వరుస సినిమా అవకాశాలతో దూసుకుపోతున్న సమయంలో దేవిక సినిమా పరిశ్రమలో పలు చిత్రాలకు అసిస్టెంట్ దర్శకుడిగా పని చేసిన "దేవదాసు" అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది.

**తర్వాత తన భర్తని దర్శకుడిగా సినిమా పరిశ్రమకు పరిచయం చేసేందుకుగాను తాను కష్టపడి కూడబెట్టుకున్న ఆస్తులను అమ్మేసింది. అయినప్పటికీ తన భర్త మాత్రం ప్రేక్షకులను ఊహించిన విధంగా రాణించలేక పోయాడు. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు, విభేదాలు వచ్చాయి. తర్వాత తమిళ సినిమాల్లో నటించిన తన కూతురు కనక తో కలిసి కడు బాధా కరమైన శేష జీవితం గడిపింది.**

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర (1984), ఆడవాళ్ళు అలిగితే (1983), నయా దిన్ నయా రాత్ (1974) (హిందీ), పాపం పసివాడు (1972), చిన్ననాటి స్నేహితులు (1971), ఇజ్జత్ (1968) (హిందీ), నిలువు దోపిడి (1968), భామా విజయం (1967), శ్రీకృష్ణా వతారం (1967) - రుక్మిణీ, తిరువిల యాడల్ (1965) (తమిళం) - శెంబగ పాండ్యన్ భార్య, పెంపుడు కూతురు (1963), కర్ణ (1963) - శుభాంగి ,రక్త సంబంధం (1962), మహామంత్రి తిమ్మరుసు (1962) - అన్నపూర్ణ, దక్షయజ్ఞం (1962) - సతీదేవి, గాలిమేడలు (1962), బలే పాండియ (1962), బంధ పాశమ్ (1962) (తమిళం), మన్ మౌజీ (1962) (హిందీ), నెంజిల్ ఒరే ఆలయమ్ (1962) (తమిళం) - సీత, టాక్సీ రాముడు (1961), పెండ్లి పిలుపు (1961), ఘరానా (1961) (హిందీ), పాప పరిహారం (1961), పావమణిప్పు (1961) (తమిళం) - క్రైస్తవ సహాయకురాలు, శభాష్ రాజా (1961), మాంగల్యం (1960), సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి (1960), శాంతి నివాసం (1960), శభాష్ రాముడు (1959), ఘర్ సన్సార్ (1958) (హిందీ) - భారతి, వరుడు కావాలి (1957), రేచుక్క (1954) - లలితాదేవి తదితర చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించి ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయింది.

**ఎన్.టి.రామారావు నిర్మించిన 'శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర' సినిమాలో చివరి సారిగా నటించింది. ఆ తర్వాత సినీ పరిశ్రమకు దూరమైంది. 2002 మే 2వ తేదీ తెల్లవారు జామున మద్రాసులోని ఒక ప్రైవేటు [illegible] మరణించింది.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తొలి వార్తాహరుడు.. ఆదర్శ పాత్రికేయుడు



## లోకహితం కోసమే ముల్లోక సంచారం : నేడు నారద జయంతి

భారతీయ పురాణేతిహాసాలలో తొలి వార్తాహరుడిగా, నిరంతర లోక సంచారిగా దేవర్షి నారదుడికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. వైశాఖ కృష్ణ పాడ్యమిని పురస్కరించుకుని శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా నారద జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. కృత, త్రేతా, ద్వాపర యుగాలన్నింటిలోనూ ధర్మం వైపు నిలబడి, ముల్లోకాల విశేషాలను ఎప్పటికప్పుడు చేరవేసే పాత్రికేయ ధర్మానికి ఆయన ఆద్యుడిగా నిలిచారు. బ్రహ్మ మానస పుత్రుడైన నారదుడు, చేతుల్లో చిరు తలు, మహతి అనే వీణను ధరించి, నిరం తరం హరినామ సంకీర్తన చేస్తూ లోక కళ్యా ణం కోసం తపించే మహర్షిగా ప్రతి హిం దూ పురాణంలోనూ మనకు కనిపిస్తారు. నారదుడు కేవలం సమాచారాన్ని ఒక చోటు నుండి మరో చోటుకు చేరవేయడమే కాకుండా, మంచి-చెడుల మధ్య జరిగే యుద్ధంలో ఎప్పుడూ ధర్మ పక్షపాతిగానే వ్యవహరిస్తారు. ఆయనను కొందరు 'కలహ ప్రియుడు' అని అభివర్ణించినప్ప టికీ, ఆ కలహాల వెనుక ఎప్పుడూ ఒక ఉన్నతమైన లోక హితం దాగి ఉంటుంది. 'యథార్థవాది లోక విరోధి' అన్న చందాన, నారదుడు చెప్పే సత్యాలు సందర్భానుసారం గా కఠినంగా అనిపించినా, అవి చివరకు రాక్షస సంహారానికో లేదా ధర్మ విజయాని కో దారి తీస్తాయి. ముల్లోకాలలోనూ సంచరిస్తూ దేవ, మానవ, దానవులకు వారి వారి కర్తవ్యాలను గుర్తు చేస్తూ అజ్ఞానాన్ని పోగొట్టడమే ఆయన నిరంతర దీక్ష.

సాహిత్య మరియు ఆధ్యాత్మిక రంగాలలో నారదుని ప్రభావం అపారం. వాల్మీకి మహర్షికి శ్రీరాముని ఉత్తమ గుణాలను వివరించి, రామాయణం వంటి గొప్ప కావ్యాన్ని రాయాలని ప్రేరేపించింది నారదులే. అలాగే, వేదాలను విభజించిన తర్వాత కూడా చిత్తశాంతి లభించని వేద వ్యాసునికి, హరి లీలలతో కూడిన 'శ్రీమద్భాగవతం' రచించమని దిశానిర్దేశం చేసి భక్తి మార్గాన్ని ప్రచారం చేశారు. ధ్రువు డు మరియు ప్రహ్లాదుడు వంటి గొప్ప భక్తులకు చిన్నతనంలోనే జ్ఞానాన్ని బోధించి, వారిని మోక్ష మార్గం వైపు నడిపించిన ఘనత కూడా ఆయనదే. విష్ణుమూర్తి ధరిం చిన పలు అవతారాలకు పరోక్షంగా నారదుడే కారకుడిగా కనిపిస్తారు. ప్రస్తుత ఆధునిక కాలంలో పాత్రికేయులు నారదుడిని తమకు ఆదర్శంగా తీసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం సమాచారాన్ని సేకరించడమే కాకుండా, ఆ విజ్ఞానాన్ని లోక హితం కోసం, సమాజంలో సత్యం మరియు న్యాయాన్ని స్థాపించడం కోసం వినియోగించాలి. స్వార్థం లేని సమాచార సేకరణ, నిర్భయంగా నిజాన్ని వెల్లడించడం వంటి లక్షణాల తో నారద మహర్షి జీవితం ప్రతి పాత్రికే యుడికి ఒక దిక్సూచిగా నిలుస్తుంది. నారద జయంతి సందర్భంగా పలు ఆధ్యాత్మిక సంస్థలు, పాత్రికేయ సంఘాలు ప్రత్యేక సదస్సులు మరియు పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# బంగారం ధరలకు స్వల్ప ఉపశమనం

**హైదరాబాద్, మే 1 :** గత రెండు రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు ఈ రోజు స్వల్పంగా తగ్గాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభించింది. గురువారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,730 వద్ద ట్రేడ్ కాగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,40,000, 18 క్యారెట్ల బంగారం రూ.1,14,550 వద్ద నమోదైంది. తాజా సమాచారం ప్రకారం ఉదయం సమయానికి ధరలు మరింత తగ్గినట్లు తెలుస్తోంది. 24 క్యారెట్ల బంగారంపై రూ.380, 22 క్యారెట్లపై రూ.350, 18 క్యారెట్లపై రూ.290 మేర తగ్గుదల కనిపించింది. దీంతో ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,52,350 వద్ద, 22 క్యారెట్ల బంగారం రూ.1,39,650 వద్ద, 18 క్యారెట్ల బంగారం రూ.1,14,260 వద్ద ట్రేడవుతోంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, బెంగళూరు నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,52,350 వద్ద ఉండగా, ఢిల్లీలో రూ.1,52,500గా ఉంది. చెన్నై, మధురై, కోయంబత్తూరు నగరాల్లో ధరలు కొంచెం ఎక్కువగా ఉండి రూ.1,53,280 వద్ద నమోదయ్యాయి. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం అంతర్జాతీయ మార్కెట్‌లో ఒడిదుడుకులు, డాలర్ విలువ మార్పులు, పెట్టుబడిదారుల డిమాండ్ వంటి అంశాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. రాబోయే రోజుల్లో ధరలు మరింత మారే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు. ప్రస్తుతం ధరలు తగ్గిన నేపథ్యంలో కొనుగోలుదారులు మార్కెట్ పరిస్థితులను గమనించి నిర్ణయం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# మస్క్‌కు భారీ వేతన ప్యాకేజీ

**న్యూయార్క్, మే 1:** ప్రపంచంలోనే అత్యంత ధనవంతులలో ఒకరైన ఎలాన్ మస్క్ మరోసారి రికార్డు స్థాయి వేతన ప్యాకేజీ వార్తల్లో నిలిచింది. ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజం టెస్లా 2025 ఆర్థిక సంవత్సరానికి గాను మస్క్‌కు 158 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ.15 లక్షల కోట్లు) ప్యాకేజీని ప్రకటించింది. ఈ సమాచారం కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడైంది. అయితే, ఈ భారీ మొత్తం మస్క్‌కు నేరుగా నగదు రూపంలో అందదు. ఆయనకు సాధారణంగా నెలవారీ జీతం ఉండదు. స్టాక్ అవార్డులు, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల రూపంలోనే ఈ పారితోషికం ఇవ్వబడుతుంది. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్యాకేజీలో ప్రధాన భాగం పనితీరు ఆధారితమే. దాదాపు 132 బిలియన్ డాలర్ల విలువైన స్టాక్ అవార్డులు కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలు పూర్తయితేనే మస్క్‌కు లభిస్తాయి. అంటే, టెస్లా వ్యాపార విస్తరణ, మార్కెట్ విలువ, లాభదాయకత వంటి అంశాల్లో నిర్దిష్ట లక్ష్యాలు చేరుకుంటేనే ఆయనకు ఈ మొత్తం అందుతుంది. మిగతా 26 బిలియన్ డాలర్ల ప్యాకేజీ కూడా టెస్లా బోర్డు ఆమోదంపై ఆధారపడి ఉంది. బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే ఈ భాగం మస్క్ చేతికి చేరుతుంది. దీంతో మొత్తం ప్యాకేజీ అందుకోవడం అనేది పూర్తిగా కంపెనీ పనితీరు మరియు నిర్ణయాలపై ఆధారపడి ఉందని స్పష్టం అవుతోంది. మొత్తానికి, ప్రపంచ కార్పొరేట్ చరిత్రలోనే అత్యంత భారీ వేతన ప్యాకేజీలలో ఒకటిగా ఇది నిలుస్తున్నప్పటికీ, ఇది పూర్తిగా షరతులతో కూడినదే కావడం విశేషం.

# వన్‌ప్లస్-రియల్‌మీ కలయిక?

**బీజింగ్, మే 1:** చైనా నుంచి వెలువడుతున్న తాజా నివేదికల ప్రకారం ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌లు వన్‌ప్లస్ మరియు రియల్‌మీ తమ గ్లోబల్ కార్యకలాపాలను ఏకీకృతం చేసే దిశగా కీలక అడుగులు వేస్తున్నాయి. పెరుగుతున్న పోటీ మధ్య వ్యూహాత్మక వృద్ధిని సాధించడం, ఖర్చులను తగ్గించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశాలుగా భావిస్తున్నారు. ఈ విలీన ప్రక్రియకు ఒప్పోలో కీలక పాత్ర పోషిస్తున్న పీటే లౌ నేతృత్వం వహించే అవకాశముంది. ప్రొడక్ట్ ప్లానింగ్, మార్కెటింగ్, కస్టమర్ సపోర్ట్, గ్లోబల్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాలను ఒకే కేంద్రం నుంచి పర్యవేక్షించేలా నిర్మాణాత్మక మార్పులు చేయాలని కంపెనీలు భావిస్తున్నాయి. ఈ విలీనంతో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) ఖర్చులు తగ్గడం, టెక్నాలజీ పంచుకోవడం, డిజైన్‌లను పునర్వినియోగం చేసుకోవడం వంటి ప్రయోజనాలు లభించే అవకాశం ఉంది. ఇప్పటికే యూరప్ మార్కెట్‌లో వన్‌ప్లస్ ప్రభావం తగ్గుతోందన్న వార్తల నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. వినియోగదారులపై ప్రభావం ఎలా..? ఈ కలయికతో భవిష్యత్తులో వచ్చే వన్‌ప్లస్ ఫోన్లు రియల్‌మీ లేదా ఒప్పో డివైజ్‌లకు మరింత దగ్గరగా ఉండే అవకాశముంది. ఉమ్మడి ఫీచర్లు, తక్కువ ధరలతో వినియోగదారులకు ప్రయోజనం కలగవచ్చు. అయితే, వన్‌ప్లస్‌కు ఉన్న ప్రత్యేక గుర్తింపు (బ్రాండ్ ఐడెంటిటీ) తగ్గిపోతుందేమోనన్న ఆందోళన కూడా టెక్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. గ్లోబల్ స్థాయిలో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ, భారత మార్కెట్‌లో మాత్రం వన్‌ప్లస్ తన బలమైన స్థానాన్ని కొనసాగిస్తూ కొత్త ఉత్పత్తులను విడుదల చేసే అవకాశముందని సమాచారం. మొత్తం మీద ఈ విలీనం స్మార్ట్‌ఫోన్ రంగంలో కొత్త సమీకరణాలకు




# మేలో కార్ల పండగ

## మార్కెట్లోకి టాప్ 5 కొత్త మోడల్స్!

**హైదరాబాద్, మే 1 :** భారత ఆటోమొబైల్ రంగానికి మే నెల అత్యంత కీలకంగా మారింది. ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్ మోడల్స్, పవర్‌ఫుల్ ఎస్‌యూవీలతో మార్కెట్ కిక్కిరిసిపోనుంది. ప్రముఖ కంపెనీలు వరుసగా కొత్త కార్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నాయి. ఈ నెలలో రాబోయే టాప్ 5 కార్ల వివరాలు ఇవే.

### 1) టాటా సియెర్రా ఈవీ

టాటా మోటార్స్ తన ఐకానిక్ 'సియెర్రా'ను ఎలక్ట్రిక్ అవతారంలో తీసుకురానుంది. ఇందులో 75 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ, డ్యూయల్ మోటార్ సెటప్ ఉండే అవకాశం ఉంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే దాదాపు 500 కిలోమీటర్ల రేంజ్ ఇవ్వగలదని అంచనా. 5-స్టార్ భద్రతా ప్రమాణాలు, ఆధునిక-ఇాణాూ ఫీచర్లు ప్రత్యేక ఆకర్షణ.

### 2) హోండా జెడ్ఆర్-వీ

హోండా నుంచి వస్తున్న ఈ కొత్త హైబ్రిడ్ ఎస్‌యూవీ మే 22న లాంచ్ కానుంది. 2.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో పాటు రెండు ఎలక్ట్రిక్ మోటార్లు ఉండి 181 బిహెచ్‌పీ పవర్, 315 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. హెడ్స్-అప్ డిస్‌ప్లే, వైర్లెస్ ఛార్జింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

### 3) హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్

హోండా తన పాపులర్ సెడాన్ 'సిటీ'కి కొత్త అప్‌డేట్స్ తీసుకొస్తోంది. 360 డిగ్రీ కెమెరా, పెద్ద టచ్‌స్క్రీన్, వెంటిలేటెడ్ సీట్లు వంటి సౌకర్యాలతో ఈ మోడల్ వస్తుంది. హైబ్రిడ్ ఆప్షన్ కూడా అందుబాటులో ఉంటుంది.

### 4) ఎంజీ మెజెస్టర్

టోయోటా ఫార్చ్యూనర్‌కు పోటీగా ఎంజీ ఈ మెజెస్టర్‌ను



తీసుకువస్తోంది. 3-జోన్ క్లైమేట్ కంట్రోల్, మసాజ్ సీట్లు, ఆఫ్‌రోడ్ సామర్థ్యాలు దీనికి ప్రత్యేకత. 2.0 లీటర్ డీజిల్ ఇంజిన్, 8-స్పీడ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌తో రానుంది.

### 5) టోయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా

భారత మార్కెట్లో టోయోటా నుంచి వస్తున్న తొలి ఎలక్ట్రిక్ కారు ఇదే. మారుతి సుజుకి ఈ-విటారా ఆధారంగా రూపొందిన ఈ కారులో 49 కెడబ్ల్యుహెచ్, 61 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ ఆప్షన్లు ఉన్నాయి. పెద్ద బ్యాటరీతో 541 కిలోమీటర్ల రేంజ్ అందిస్తుందని కంపెనీ తెలిపింది. 7 ఎయిర్‌బ్యాగ్స్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్ వంటి ఫీచర్లు ఉన్నాయి.

### టూ వీలర్స్‌లోనూ జోష్

కార్లతో పాటు ఈ నెలలో బైక్ మార్కెట్ కూడా హీట్ అవుతోంది. హీరో కరిజ్మా ఎక్స్ఎంఆర్ 250, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ 650, ట్రయంఫ్ ట్రైడెంట్ 800 వంటి మోడల్స్ విడుదల కానున్నాయి.

**మొత్తానికి, కొత్త కారు కొనాలని భావిస్తున్న వారికి మే నెల మంచి అవకాశం. ఈ కొత్త మోడల్స్ మార్కెట్లోకి వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.**

# డీజిల్, ఏటీఎఫ్‌పై సుంకం తగ్గింపు

**న్యూఢిల్లీ, మే 1:** దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ఎగుమతులపై విధిస్తున్న అదనపు సుంకం (విండ్‌ఫాల్ ట్యాక్స్)ను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం మే 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. తాజా నిర్ణయం ప్రకారం డీజిల్ ఎగుమతులపై లీటర్‌కు ఉన్న అదనపు పన్నును రూ.55 నుంచి రూ.23కి తగ్గించగా, ఏటీఎఫ్‌పై రూ.42 నుంచి రూ.33కి తగ్గించారు. పెట్రోల్ ఎగుమతులపై అదనపు పన్ను మాత్రం సున్నాగా కొనసాగుతోంది. ఈ మేరకు ఆర్థిక మంత్రిత్వశాఖ అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దేశంలో ఇంధన సరఫరా నిలకడగా ఉండేందుకు గతంలో కేంద్రం ఎగుమతులపై సుంకాలు పెంచింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా అంతరాయం భయాలతో ఈ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే పరిస్థితులు కాస్త సద్దుమణగడంతో ఇప్పుడు సుంకాలను తగ్గిస్తూ కేంద్రం మరోసారి సమీక్షించింది. ఈ తాజా తగ్గింపుతో డీజిల్‌పై దాదాపు 58 శాతం వరకు సుంకం తగ్గినట్లైంది. ఎగుమతిదారులకు ఇది కొంత ఊరటగా మారగా, దేశీయంగా సరఫరా వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదేవిధంగా మే 1 నుంచి వచ్చే 15 రోజుల పాటు డీజిల్ ఎగుమతులపై రోడ్డు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పన్నును సున్నాగా నిర్ణయించారు. అయితే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం అమల్లో ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్రం స్పష్టం చేసింది. మొత్తానికి, అంతర్జాతీయ పరిణామాలు, దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇంధన రంగంలో కీలక మార్పులకు దారితీసే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.






# స్పోర్టీ ఎలక్ట్రిక్ బైక్‌తో 'ఓబెన్' దూసుకెళ్తోంది!

**హైదరాబాద్, మే 1 :** ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో తనదైన ముద్ర వేసుకున్న ఓబెన్ ఎలక్ట్రిక్ మరో సరికొత్త అప్‌డేట్‌తో ముందుకొచ్చింది. స్పీడ్, స్టైల్ కోరుకునే యువత కోసం పూర్తిగా స్పోర్టీ డిజైన్‌తో రూపొందించిన కొత్త ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్‌కు సంబంధించిన టీజర్‌ను విడుదల చేసి ఆటోమొబైల్ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈ మోడల్‌ను ఏప్రిల్ 30న అధికారికంగా ఆవిష్కరించనుంది.

### అగ్రెసివ్ డిజైన్ - నయా లుక్

ఈ బైక్ సాధారణ కమ్యూటర్ మోడళ్లకు భిన్నంగా పూర్తి స్పోర్ట్స్ లుక్‌తో కనిపిస్తోంది. టీజర్‌లో కనిపించిన వివరాల ప్రకారం సింగిల్ ఎల్ఈడి డీఆర్ఎల్‌తో కూడిన ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్ బైక్‌కు అగ్రెసివ్ ఫీలింగ్ ఇస్తోంది. గతంలో ఓబెన్ ఎలక్ట్రిక్ తీసుకొచ్చిన మోడళ్లు ఎక్కువగా రెట్రో స్టైల్‌లో ఉండగా, ఈ కొత్త వెర్షన్ మాత్రం షార్ప్ ఎడ్జెస్, మోడ్రన్ డిజైన్‌తో యువతను టార్గెట్ చేస్తోంది.

### పర్ఫార్మెన్స్ సెగ్మెంట్‌లోకి ఎంట్రీ

ఇప్పటివరకు ఎంట్రీ లెవల్, బడ్జెట్ సెగ్మెంట్‌పై దృష్టి పెట్టిన కంపెనీ, ఈసారి ప్రీమియం మరియు హై-పర్ఫార్మెన్స్ విభాగంలోకి అడుగుపెడుతోంది. స్పీడ్ ప్రియులను దృష్టిలో పెట్టుకుని శక్తివంతమైన ఎలక్ట్రిక్ మోటార్‌ను అమర్చినట్లు తెలుస్తోంది. దీని ద్వారా ఎలక్ట్రిక్ బైక్ మార్కెట్లో పోటీ మరింత పెరిగే అవకాశముంది.

### బ్యాటరీ, రేంజ్ అంచనాలు

ఈ మోటార్‌సైకిల్‌లో భారీ సామర్థ్యం గల బ్యాటరీ ప్యాక్ ఉండే అవకాశం ఉంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే మంచి రేంజ్‌తో పాటు ఆకట్టుకునే టాప్ స్పీడ్ కూడా అందించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

### లాంచ్ డేలోనే బుకింగ్స్?

పూర్తి స్పెసిఫికేషన్లు, ధర, డెలివరీ వివరాలను లాంచ్ రోజున ప్రకటించనున్నారు. అదే రోజున బుకింగ్స్ ప్రారంభించే అవకాశముండటంతో, స్పోర్ట్స్ ఎలక్ట్రిక్ బైక్ కోసం ఎదురుచూస్తున్న వారికి ఇది మంచి అవకాశం కానుంది. మొత్తానికి, కొత్త డిజైన్, మెరుగైన పనితీరుతో ఓబెన్ ఎలక్ట్రిక్ తీసుకొస్తున్న ఈ బైక్ మార్కెట్లో కొత్త ట్రెండ్‌కు నాంది పలకనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఏప్రిల్‌లోనూ డిజిటల్ చెల్లింపుల జోరు

## యూపీఐ మరో రికార్డు!

**న్యూఢిల్లీ, మే 1 :** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ వేగంగా విస్తరిస్తూ మరోసారి తన బలం చాటుకుంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో దేశవ్యాప్తంగా 22.35 బిలియన్ల లావాదేవీలు నమోదయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.29.03 లక్షల కోట్లకు చేరుకుంది. గతేడాదితో పోలిస్తే లావాదేవీల సంఖ్యలో 25 శాతం, మొత్తం విలువలో 21 శాతం వృద్ధి నమోదవడం డిజిటల్ చెల్లింపులపై ప్రజల ఆధారపడుతున్న స్థాయిని స్పష్టంగా చూపిస్తోంది. రోజువారీ లావాదేవీల పరంగా కూడా వృద్ధి కనిపించింది. మార్చిలో రోజుకు సగటున 730 మిలియన్ల లావాదేవీలు జరిగితే, ఏప్రిల్‌లో ఈ సంఖ్య 745 మిలియన్లకు పెరిగింది. రోజువారీ లావాదేవీల సగటు విలువ కూడా రూ.95,243 కోట్ల నుంచి రూ.96,766 కోట్లకు చేరింది. ఇదే సమయంలో ఐఎంపీఎస్ ద్వారా 362 మిలియన్ల లావాదేవీలు జరిగి, వాటి విలువ రూ.7.01 లక్షల కోట్లుగా నమోదైంది. భారత్ గర్వకారణమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ సేవలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, ఫ్రాన్స్, శ్రీలంక, మారిషస్ వంటి దేశాలతో పాటు ఎనిమిదికి పైగా దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ విస్తరణతో విదేశాల నుంచి డబ్బు పంపించడం మరింత సులభమవుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత పదేళ్లలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో సుమారు 12,000 రెట్లు పెరుగుదల నమోదైంది. 2016-17లో కేవలం 2 కోట్ల లావాదేవీలే ఉండగా, 2025-26 నాటికి ఈ సంఖ్య 24,162 కోట్లకు చేరుకుంది. అదే సమయంలో లావాదేవీల విలువ రూ.0.07 లక్షల కోట్ల నుంచి రూ.314 లక్షల కోట్లకు పెరిగి, దాదాపు 4,000 రెట్ల వృద్ధిని నమోదు చేసింది. యూపీఐ పనితీరు, విశ్వసనీయత కారణంగా భారత్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో అగ్రస్థానంలో నిలిచింది. ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా యూపీఐను అంతర్జాతీయ ద్రవ్య నిధి కూడా గుర్తించడం విశేషం.





దూసుకెళ్తున్న స్వింగ్ మాస్టర్

# భువనేశ్వర్

## జస్ప్రీత్ బుమ్రా రికార్డు బ్రేక్!

టీమిండియా సీనియర్ పేసర్, స్వింగ్ మాస్టర్ భువనేశ్వర్ కుమార్ అరుదైన ఘనత అందుకున్నాడు. భారత్ తరఫున పురుషుల టీ20 క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా గురువారం అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున బరిలోకి దిగిన భువీ 3 వికెట్స్ పడగొట్టడంతో ఈ రికార్డు అతడి ఖాతాలో చేరింది. ఈ క్రమంలో జస్ప్రీత్ బుమ్రా రికార్డును భువనేశ్వర్ బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ అగ్రస్థానంలో నిలిచాడు. యూజీ 391 వికెట్లు పడగొట్టి టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. తన లెగ్ స్పిన్ మాయాజాలంతో బ్యాటర్లను బోల్తా కొట్టిస్తూ.. మ్యాచ్‌లను మలుపుతిప్పడంలో చహల్ ప్రత్యేక నైపుణ్యం చూపించాడు. యూజీ తర్వాతి స్థానంలో భువనేశ్వర్ కుమార్ ఉన్నాడు. ప్రస్తుతం 350 వికెట్లతో ఉన్న భువీ.. త్వరలోనే ఈ జాబితాలో మరింత పైకి చేరే అవకాశం ఉంది. మూడో స్థానంలో జస్ప్రీత్ బుమ్రా నిలిచాడు. అతడు 347 వికెట్లు సాధించి టీ20ల్లో అత్యంత ప్రభావవంతమైన పేసర్లలో ఒకడిగా నిలిచాడు. పీయూష్ చావ్లా 327 వికెట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. ఐదో స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ 317 వికెట్లతో కొనసాగుతున్నాడు.

**టీ20లలో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లు:**

# 391 - యుజ్వేంద్ర చహల్
# 350 - భువనేశ్వర్ కుమార్
# 347 - జస్ప్రీత్ బుమ్రా
# 327 - పీయూష్ చావ్లా
# 317 - రవిచంద్రన్ అశ్విన్

# బాబర్ బ్లాస్ట్..

## కోహ్లీ రికార్డులకు సవాల్!

**పీఎస్ఎల్ క్వాలిఫైయర్‌లో బాబర్ కెప్టెన్ ఇన్నింగ్స్**

**ఒత్తిడిలో సెంచరీతో జల్మీకి ఫైనల్ బెర్త్**

**టీ20 కెప్టెన్‌గా కొత్త చరిత్ర సృష్టించిన బాబర్**

**కోహ్లీ సరసన మరో అరుదైన ఘనత**



పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ మరోసారి తన క్లాస్‌ను నిరూపించాడు. బాబర్-విరాట్ కోహ్లీ పోలికలు ఎప్పుడూ క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగానే ఉంటాయి. ఇప్పుడు మరో అద్భుత ఇన్నింగ్స్‌తో బాబర్ తన పేరు మళ్లీ రికార్డుల పుస్తకాల్లో నిలిపాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్‌పై అద్భుత శతకంతో పెషావర్ జల్మీని ఫైనల్‌కు చేర్చుతూ కెప్టెన్‌గా అసలైన నాయకత్వాన్ని చూపించాడు. కీలకమైన ఈ మ్యాచ్‌లో బాబర్ ఒత్తిడిని ఏమాత్రం పట్టించుకోకుండా 59 బంతుల్లోనే 103 పరుగులు చేసి చెలరేగిపోయాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 4 భారీ సిక్సర్లు ఉండగా.. కరాచీ వంటి కఠినమైన పిచ్‌పై ఈ ప్రదర్శన మరింత ప్రత్యేకమైంది. బాబర్‌కు తోడుగా మహమ్మద్ హారిస్, కుశాల్ మెండిస్, ఆరోన్ హార్డీ వేగంగా ఆడటంతో జల్మీ 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఇస్లామాబాద్ 151 పరుగులకే పరిమితమవడంతో జల్మీ సునాయాస విజయాన్ని అందుకుంది. ఈ సెంచరీతో బాబర్ టీ20 క్రికెట్‌లో కెప్టెన్‌గా అత్యధిక శతకాలు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఇప్పటివరకు 9 సెంచరీలు నమోదు చేసి ఫాఫ్ డుప్లెసిస్ పేరిట ఉన్న 8 శతకాల రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో మైఖేల్ క్లింగర్, విరాట్ కోహ్లీ, జేమ్స్ విన్స్ వంటి స్టార్‌లు అతని వెనుక నిలిచారు. పీఎస్ఎల్ చరిత్రలో ఇది బాబర్‌కు నాలుగో సెంచరీ. దీంతో ఉస్మాన్ ఖాన్ పేరిట ఉన్న అత్యధిక శతకాల రికార్డును సమం చేశాడు. ఈ సీజన్‌లో అతని పరుగుల ప్రవాహం చూస్తే ప్రత్యర్థి బౌలర్లకు పెద్ద సవాల్‌గా మారాడు. ఇప్పటికే 588 పరుగులతో ఒకే సీజన్‌లో అత్యధిక పరుగుల రికార్డును కూడా అందుకున్నాడు. ఇక ఒకే దేశంలో 8 టీ20 సెంచరీలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో బాబర్.. విరాట్ కోహ్లీ, అభిషేక్ శర్మల సరసన చేరాడు. తన ఫామ్‌పై స్పందించిన బాబర్.. తాను మళ్లీ పాత రిథమ్‌ను అందుకుంటున్నానని, కష్టాన్ని నమ్మి సాధన చేసిన ఫలితమే ఇప్పుడు కనిపిస్తోందని చెప్పాడు. మొత్తానికి ఈ ఇన్నింగ్స్‌తో బాబర్ ఆజమ్ మరోసారి ప్రపంచ క్రికెట్‌కు తన స్థాయి ఏమిటో చూపించడమే కాకుండా.. కోహ్లీతో పోలికల్లో తన పేరును మరింత బలంగా నిలబెట్టాడు.

# రాజస్థాన్‌పై ఢిల్లీ పంజా!

- పరుగుల వరద పారిన మ్యాచులో క్యాపిటల్స్ ఘనవిజయం
- ఏడు వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్ చిత్తు
- వృథా అయిన రియాన్ పరాగ్ మెరుపు ఇన్నింగ్స్
- అదరగొట్టిన రాహుల్, నిస్సంక, స్టార్క్





జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ మైదానం వేదికగా శుక్రవారం జరిగిన ఐపీఎల్ ఉత్కంఠ పోరులో రాజస్థాన్ రాయల్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం సాధించింది. పరుగుల వరద పారిన ఈ మ్యాచులో కఠినమైన భారీ లక్ష్యాన్ని ఢిల్లీ బ్యాటర్లు అలవోకగా ఛేదించారు. రాజస్థాన్ నిర్దేశించిన రెండు వందల ఇరవై ఆరు పరుగుల టార్గెట్ ను పందొమ్మిది పాయింట్ ఒకటి ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే ఏడు వికెట్ల తేడాతో ఢిల్లీ జట్టు జయభేరి మోగించింది.

**రాజస్థాన్ భారీ స్కోరు..**

అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ జట్టు నిర్ణీత ఇరవై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. రాజస్థాన్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ముఖ్యంగా క్రీజులో పాతుకుపోయిన రియాన్ పరాగ్ కేవలం యాభై బంతుల్లోనే 96 విధ్వంసం సృష్టించాడు. అతనికి జతగా డొనోవన్ ఫెరీరా కేవలం పద్నాలుగు బంతుల్లోనే అజేయంగా నలభై ఏడు పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ధ్రువ్ జురెల్ కూడా ముప్పై బంతుల్లో 42 పరుగులతో మెరుగైన ప్రదర్శన చేశాడు. ఢిల్లీ బౌలర్లలో స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ నాలుగు ఓవర్లలో నలభై పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. అక్షర్ పటేల్ కు ఒక వికెట్, కైల్ జేమీసన్ కు ఒక వికెట్ దక్కాయి.

**లక్ష్యాన్ని కరిగించిన ఓపెనర్లు..**

అనంతరం రెండు వందల ఇరవై ఆరు పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు టాప్ ఆర్డర్ బ్యాటర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. కేఎల్ రాహుల్ కేవలం నలభై బంతుల్లో డెబ్బై ఐదు పరుగులు చేసి జట్టు విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించాడు. దానికి తోడు పాతుమ్ నిస్సంక సైతం ముప్పై మూడు బంతుల్లో అరవై రెండు పరుగులతో అద్భుత అర్ధ సెంచరీ సాధించి రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన నితీశ్ రాణా కేవలం పదిహేడు బంతుల్లో ముప్పై మూడు పరుగులతో జోరు కొనసాగించి లక్ష్యాన్ని సునాయాసంగా కరిగించాడు. రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా (ఒకటి బై ముప్పై మూడు), తుషార్ దేశ్ పాండే (ఒకటి బై ముప్పై ఎనిమిది), జోఫ్రా ఆర్చర్ (ఒకటి బై నలభై ఆరు) తలో వికెట్ మాత్రమే తీసి దారుణంగా నిరాశపరిచారు. ఏ దశలోనూ ఢిల్లీ బ్యాటర్లను నిలువరించలేకపోయిన రాజస్థాన్ బౌలర్లు పూర్తిగా విఫలం కావడంతో ఆ జట్టుకు సొంతగడ్డపై ఘోర పరాజయం తప్పలేదు.

# మైదానంలోనే కుస్తీ.. బయట మాత్రం దోస్తీ!

- ఆటలో అగ్రెసివ్.. మ్యాచ్ తర్వాత ఆప్యాయత
- కోహ్లీ-గిల్ బంధం మళ్లీ వైరల్
- గిల్ పోస్ట్‌తో సోషల్ మీడియాలో కొత్త చర్చ
- “ప్లే బోల్డ్”తో ఆర్సీబీకి సరదా కౌంటర్
- గెలుపు తర్వాత జీటీ కెప్టెన్‌గా గిల్ సంతృప్తి



క్రికెట్ మైదానంలో ప్రత్యర్థులుగా తలపడినా.. బయట మాత్రం స్నేహానికి కొత్త అర్థం చెప్పే జోడీగా విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్ మరోసారి నిలిచారు. గురువారం జరిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు-గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ తర్వాత ఈ ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం మళ్లీ అభిమానుల్లో చర్చనీయాంశమైంది. పోటీలో ఎవరికి వారు గెలవాలనే తపనతో ఆడినా.. మ్యాచ్ ముగిసిన తర్వాత వారి స్నేహం అందరి దృష్టిని ఆకర్షించింది. ఆర్సీబీపై గుజరాత్ విజయం సాధించిన అనంతరం గిల్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. ఆర్సీబీ ప్రసిద్ధ నినాదం “ప్లే బోల్డ్”ను ఉపయోగిస్తూ.. కోహ్లీ ఫోటోను షేర్ చేయడం అభిమానులను ఆకట్టుకుంది. ఇది ప్రత్యర్థిపై వ్యంగ్యమా.. లేక స్నేహపూర్వక సరదానా అన్న చర్చ సోషల్ మీడియాలో జోరందుకుంది. మ్యాచ్ సమయంలో మాత్రం కోహ్లీ తనదైన అగ్రెసివ్ శైలిని ప్రదర్శించాడు. గిల్ వికెట్ పడగానే కోహ్లీ ఉత్సాహంగా సెలబ్రేట్ చేయడం, ఓ క్యాచ్ వివాదంపై ఫోర్త్ అంపైర్‌తో వాదించడం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఆట ముగిసిన తర్వాత ఇద్దరూ నవ్వుతూ మాట్లాడుకోవడం.. మైదానంలోని పోటీ కేవలం ఆటవరకే పరిమితమని మరోసారి స్పష్టం చేసింది. మ్యాచ్ అనంతరం గిల్ తన జట్టు ప్రదర్శనపై ఆనందం వ్యక్తం చేశాడు. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే పరిమితం చేసిన బౌలర్లను ప్రత్యేకంగా అభినందించాడు. ఫీల్డింగ్‌లో గత మ్యాచ్‌లతో పోలిస్తే ఈసారి ఆటగాళ్లు మెరుగైన శక్తి, ఉత్సాహం చూపించారని ప్రశంసించాడు. తన వ్యక్తిగత బ్యాటింగ్‌పై స్పందిస్తూ.. ఆ రోజు తాను పూర్తిగా ఫోకస్‌లో ఉన్నానని, బౌలర్లపై ఆధిపత్యం చెలాయించాలనే స్పష్టమైన ఆలోచనతో క్రీజ్‌లోకి దిగానని తెలిపాడు. రాహుల్ తెవాటియా మ్యాచ్‌ను ముగించిన తీరు జట్టుకు విశ్వాసాన్ని పెంచిందని, కొన్ని అదనపు వికెట్లు కోల్పోయినా ప్రతి ఒక్కరికీ అవకాశాలు రావడం సానుకూల అంశమని గిల్ పేర్కొన్నాడు. మొత్తానికి కోహ్లీ-గిల్ మధ్య మైదానంలో పోటీ ఎంత ఉత్కంఠభరితంగా ఉన్నా.. బయట వారి బంధం మాత్రం భారత క్రికెట్‌లో ‘కింగ్-ప్రిన్స్’ అనుబంధానికి ప్రతీకగా మరోసారి నిలిచింది.



# ఐపీఎల్ రూల్స్‌లో మార్చాల్సిందేనా?

- ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుసగా భారీ స్కోర్లు
- తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న బౌలర్లు
- ఐపీఎల్ నిబంధనల్లో మార్పులు తప్పనిసరి అంటున్న కైఫ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో మ్యాచ్‌ల తరహా పూర్తిగా బ్యాటర్ల ఆధిపత్యంగా మారిపోతుండటంపై మాజీ భారత క్రికెటర్ మొహమ్మద్ కైఫ్ ఆందోళన వ్యక్తం చేశాడు. వరుసగా జట్లు భారీ స్కోర్లు నమోదు చేస్తుండటంతో బౌలర్లపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, ఈ పరిస్థితిని సరిచేయాలంటే టోర్నీ నిబంధనల్లో మార్పులు తప్పనిసరిగా చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డాడు. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి జట్లు భారీ స్కోర్లతో ప్రత్యర్థులపై దూసుకెళ్తున్నాయి. 250కి పైగా పరుగులు కూడా సాధారణంగా మారుతున్న వేళ బౌలర్ల పాత్ర క్రమంగా కష్టసాధ్యమవుతోందని కైఫ్ పేర్కొన్నాడు. మొదటి ప్రధాన మార్పుగా అన్ని స్టేడియాల్లో బౌండరీల పరిమాణాన్ని సమానంగా ఉంచాలని సూచించాడు. కొన్ని మైదానాల్లో చిన్న బౌండరీలు ఉండటం వల్ల బ్యాటర్లు సులభంగా సిక్సర్లు బాదుతున్నారని, దీంతో సాధారణ స్కోర్లు కూడా రక్షించలేని పరిస్థితి వస్తోందని చెప్పాడు. 150 నుంచి 170 పరుగుల లక్ష్యాలు కూడా సురక్షితంగా లేకపోవడం బౌలర్లకు తీవ్ర అన్యాయమని అభిప్రాయపడ్డాడు. కాబట్టి పెద్ద బౌండరీలు ఉంటే బౌలర్లకు పోటీతత్వం పెరుగుతుందని సూచించాడు. రెండో కీలక అంశంగా ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను తొలగించాలని కైఫ్ డిమాండ్ చేశాడు. ఈ నిబంధన కారణంగా జట్లు అదనపు బ్యాటర్‌ను ఉపయోగించుకుని మరింత దూకుడుగా ఆడే అవకాశాన్ని పొందుతున్నాయని, ఫలితంగా బౌలర్ల ప్రాధాన్యం తగ్గిపోతోందని చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ రూల్ లేకపోవడం కూడా దాని ప్రాముఖ్యతపై సందేహాలు పెంచుతోందని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ మరింత సమతుల్యమైన టోర్నీగా మారాలంటే బ్యాటింగ్‌కు మాత్రమే కాకుండా బౌలింగ్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఉండాలని కైఫ్ స్పష్టం చేశాడు. ఇప్పుడు అతని సూచనలపై బీసీసీఐ స్పందిస్తుందా.. భవిష్యత్ సీజన్లలో మార్పులు తీసుకువస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.








# మూడు రోజులు.. మూడు కోట్లు

## 'పెద్ది' ఐటెం సాంగ్‌తో శృతి హాసన్ రచ్చ!

టాలీవుడ్ స్టార్ బ్యూటీ శృతి హాసన్ మరోసారి ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమాలో ఆమె ఒక స్పెషల్ సాంగ్‌లో మెరవబోతోందన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీని ఊపేస్తోంది. కేవలం ఈ ఒక్క పాట కోసం శృతి అందుకుంటున్న పారితోషికం వింటే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. సాధారణంగా ఒక హీరోయిన్ పూర్తి స్థాయి సినిమాకు తీసుకునే రెమ్యునరేషన్ కంటే, ఈ స్పెషల్ సాంగ్ కోసమే శృతి భారీగా వసూలు చేస్తోందని సమాచారం. కేవలం 3 నుంచి 4 రోజులు జరిగే ఈ పాట షూటింగ్ కోసం ఆమె ఏకంగా రూ. 3.5 కోట్ల వరకు పారితోషికం అందుకుంటోందన్న ప్రచారం సాగుతోంది. తక్కువ సమయంలోనే ఇంత భారీ మొత్తం అందుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. గతంలో రామ్ చరణ్, శృతి హాసన్ కలిసి నటించిన 'ఎవడు' సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో, అదే సెంటిమెంట్‌ను 'పెద్ది' కోసం కూడా ఫాలో అవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. చరణ్ పవర్ ఫుల్ స్టెప్పులు, శృతి గ్లామర్ మరియు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అదిరిపోయే సంగీతం తోడైతే, ఈ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. మొత్తానికి హీరోయిన్‌గా వరుస అవకాశాలు అందుకుంటూనే, ఇలాంటి స్పెషల్ సాంగ్స్ ద్వారా శృతి హాసన్ తన మార్కెట్ వాల్యూను అమాంతం పెంచేసుకుంటోంది. మరి ఈ క్రేజీ కాంబినేషన్ వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి!



# ఇన్‌స్టా సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్.. నేహా శర్మ ఎంట్రీ

ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో సబ్‌స్క్రిప్షన్ విధానం విస్తృతంగా ప్రాచుర్యం పొందుతోంది. ప్రత్యేక కంటెంట్ అందిస్తామని చెబుతూ పలువురు నటీమణులు ఈ విధానాన్ని ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు ఈ మార్గాన్ని ఎంచుకోగా, తాజాగా నటీమణి నేహా శర్మ కూడా ఈ జాబితాలో చేరింది. సబ్‌స్క్రిప్షన్ ద్వారా అభిమానులకు ప్రత్యేక ఫోటోలు, వీడియోలు అందిస్తామని పేర్కొంటూ కొందరు ఆకర్షణీయ ప్రకటనలు చేస్తున్నారు. ఈ విధానం యువతలో చర్చనీయాంశంగా మారుతోంది. ఇటీవల విష్ణు ప్రియా ఈ విధానాన్ని ప్రారంభించగా, ఆమెపై వివాదాలు నెలకొన్నాయి. కొన్ని ప్రచారాల నేపథ్యంలో ఆమెపై పోలీస్ కేసు నమోదవడం కూడా జరిగింది. అనంతరం అనన్య నాగళ్ల, అషు రెడ్డి, డింపుల్ హయతి వంటి వారు కూడా సబ్‌స్క్రిప్షన్ సేవలను ప్రారంభించారు. ఇప్పుడు 'చిరుత' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన నేహా శర్మ కూడా ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభించింది. నెలకు సుమారు రూ. 290 చెల్లిస్తే ప్రత్యేక కంటెంట్ అందిస్తానని ఆమె ప్రకటించింది. ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో ఆమె పోస్ట్ చేసే చిత్రాలకు విశేష స్పందన లభిస్తుండగా, ఈ కొత్త నిర్ణయం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. సోషల్ మీడియాలో అభిమానులతో నేరుగా అనుసంధానం పెంచుకోవడమే లక్ష్యంగా ఈ విధానం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అయితే ఈ సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్ భవిష్యత్తులో ఎలా మారుతుందన్నది చూడాల్సి ఉంది.




# ది ప్యారడైజ్ నుంచి మరో పాట విడుదలకు రెడీ

'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి బయటకొచ్చిన ఆయా షేర్. పాటకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మే రెండో వారంలో దీన్ని బయటకు వదలనున్నారని.. ఇదో ప్రేమ గీతంగా ఉండనుందని సమాచారం. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమాని ఆగస్టు 21న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తగ్గట్లుగానే మే చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో చిత్ర బృందం షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# బాలయ్యతో సినిమాకు శేఖర్ కమ్ముల యత్నం?

టాలీవుడ్‌లో కొన్ని కాంబినేషన్ల గురించి మొదట వినగానే ఆశ్చర్యంగా అనిపిస్తాయి. కానీ అవి నిజమైతే మాత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశం ఉంటుంది. ఇప్పుడు అలాంటి అరుదైన కాంబినేషన్ గురించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. క్లాస్ సినిమాల దర్శకుడిగా పేరొందిన శేఖర్ కమ్ముల, మాస్ హీరో నందమూరి బాలకృష్ణతో సినిమా చేయబోతున్నారనే వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. శేఖర్ కమ్ముల సినిమాలు అంటే సహజత్వం, భావోద్వేగాలు, సమాజానికి సంబంధించిన అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. 'ఆనంద్', 'గోదావరి', 'హ్యాపీ డేస్' వంటి చిత్రాలతో ఆయన క్లాస్ దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'లీడర్' సినిమా ద్వారా రాజకీయ నేపథ్యంతో కూడిన కథను కూడా బలంగా చూపించారు. మరోవైపు బాలకృష్ణ అంటే హై వోల్టేజ్ యాక్షన్, గంభీరమైన డైలాగ్స్, మాస్ ఎలిమెంట్స్ గుర్తుకొస్తాయి. ఈ ఇద్దరి స్టైల్ పూర్తిగా భిన్నమైనప్పటికీ, అదే ఈ కాంబినేషన్‌పై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల శేఖర్ కమ్ముల కథల ఎంపికలో కొత్త కోణాలను ప్రయత్నిస్తున్నారని టాక్. ఇక బాలయ్య కూడా వరుస విజయాలతో ఫామ్‌లో ఉండటంతో పాటు, కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా సమాజానికి సందేశం ఇచ్చే బలమైన కథలో నటించాలని ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో శేఖర్ కమ్ముల చెప్పిన ఒక పవర్‌ఫుల్ కథాంశం బాలయ్యను ఆకట్టుకుందని చెబుతున్నారు. ఈ సినిమా ఒక పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఇందులో బాలకృష్ణ ఒక వ్యవస్థను ప్రశ్నించే నాయకుడిగా లేదా సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగే పాత్రలో కనిపించవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. శేఖర్ కమ్ముల భావోద్వేగాల మేళవింపు, బాలయ్య శక్తివంతమైన తెరపైన ప్రెజెన్స్ కలిస్తే ప్రేక్షకులకు ఒక కొత్త అనుభవం లభించడం ఖాయం అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ అధికారికంగా ప్రకటిస్తే మాస్, క్లాస్ ప్రేక్షకులిద్దరినీ థియేటర్లకు రప్పించే శక్తి ఈ కాంబోకు ఉందని విశ్లేషకులు అంటున్నారు.



# గందరగోళంలో పడేసేలా.. జెట్లీ మూవీ




మత్తు వదలరా' సిరీస్ చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు రితేశ్ రానా. ఇప్పుడు సత్యతో కలిసి ఆయన రూపొందించిన సినిమా 'జెట్లీ'. ప్రజాపతి (అజయ్) వ్యాపారవేత్త. రూ.15 వేల కోట్ల బ్యాంకింగ్ స్కామ్‌కు పాల్పడి.. దేశం వదిలి దుబాయ్ పారిపోతాడు. దీంతో కేంద్ర హోం మంత్రి మేల్కోటి (శ్రీనివాస్ వడ్లమాని) అతన్ని అరెస్ట్ చేసి తిరిగి దేశానికి రప్పించే బాధ్యతను భారత ఇంటెలిజెన్స్‌కి అప్పజెప్తాడు. అయితే, అప్పటికే జజీరా సిండికేట్‌తో పాటు ఇంకొంత మంది శత్రువుల నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలియడంతో.. ప్రజాపతి స్వయంగా లొంగిపోయినట్లు నటించి, ఆ తర్వాత తప్పించుకోవాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. అతన్ని దుబాయ్ నుంచి కొచ్చికి ప్రత్యేక విమానంలో తీసుకొస్తుండగా.. ఆ స్కామ్‌లో భాగమైన మిగతా వ్యక్తులు తనని చంపేందుకు ఓ ప్రణాళిక రచిస్తారు. ఇలా భారత ఏజెంట్స్ నుంచి తప్పించుకోవాలని ప్రజాపతి.. అతన్ని చంపాలని శత్రువులు ప్రయత్నిస్తున్న తరుణంలో ఆ విమానంలోకి గతం మర్చిపోయిన స్థితిలో డాక్టర్ వేదవ్యాస్ (సత్య) పాత్ర ఎంట్రీ ఇస్తుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అసలు వేదవ్యాస్ ఎవరు? తన వల్ల ప్రజాపతి ఎస్కేప్ ప్లాన్ ఎలా తలకిందులైంది? ప్రజాపతి శత్రువుల్ని అతనెందుకు అడ్డుకున్నాడు? ఆఖరికి ఆ విమానం సేఫ్‌గా కొచ్చిలో ల్యాండ్ అయిందా? లేదా? ఈ కథలో ఏజెంట్ శివానీ రాయ్ (రియా సింఘా), సినీ సుడోకు ఆడుకునే వెన్నెల కిశోర్ పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. 'మత్తు వదలరా', 'హ్యాపీ బర్త్‌డే' సినిమాలు చూసిన వారికి రితేశ్ కామెడీ స్టైల్, తన చిత్రాల్లోని పాత్రలు ఎంత గమ్మత్తుగా ఉంటాయన్నది తెలిసే ఉంటుంది. ఈ 'జెట్లీ' కూడా పూర్తిగా అదే మీటర్‌లో సాగే టిపికల్ కామెడీ కథతో.. చిత్రమైన క్యారెక్టరైజేషన్లతో నిండి ఉంటుంది. ఈ కథంతా పూర్తిగా ఓ విమానంలోనే జరుగుతుంటుంది. బ్యాంకింగ్ స్కామ్‌కి పాల్పడిన ఓ బిజినెస్‌మ్యాన్‌ని ప్రాణాలతో చట్టం ముందు నిలబెట్టాలని రా ఏజెంట్స్.. అతన్ని దారిలోనే చంపేయాలని శత్రువులు.. వీళ్లందరి ప్రణాళికల్ని తారుమారు చేసే హీరో పాత్ర.. ఇలా లైన్‌గా చూసినప్పుడు కథంతా ఆసక్తిరేకెత్తించేలా అనిపిస్తుంది. కానీ, రితేశ్ దీన్ని తెరపై ఆవిష్కరించిన తీరే కాస్త గందరగోళంగా అనిపిస్తుంది. ప్రజాపతి పాత్రను.. అతడి బ్యాంకింగ్ స్కామ్‌ను టైటిల్ కార్డ్స్‌తోనే పరిచయం చేసిన దర్శకుడు.. ఆ వెంటనే కథను నేరుగా ఫ్లైట్ ఎక్కించేశాడు. ఇక ఆ విమాన ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఈ సినిమాలోని ఒక్కో పాత్ర నెమ్మదిగా ప్రేక్షకులకు పరిచయమవుతుంటుంది. గతం మర్చిపోయిన స్థితిలో డాక్టర్ వేదవ్యాస్‌గా సత్య మేల్కొనడం.. తనెవరన్నది అర్థం కాక గందరగోళానికి గురవ్వడం.. ఈ క్రమంలో పండే కన్ఫ్యూజన్ కామెడీ ఆరంభంలో బాగానే అనిపించినా.. ఆ తర్వాత రొటీన్‌గా అనిపిస్తుంది. ఇంటర్వెల్ వరకు కథ అక్కడక్కడే తిరుగుతున్న అనుభూతి కలుగుతుంటుంది. ఈ మధ్యలో సినీ సుడోకు పేరుతో వెన్నెల కిశోర్ చేసే హంగామా.. గుండు సుదర్శన్ బాంబు పేరుతో చేసే హడావుడి.. అంతా బలవంతంగా ఇరికించిన కామెడీ ట్రాక్స్‌లాగే ఉంటాయి. విరామానికి ముందు సత్య పాత్రలోని మరో కోణం బయటకు రావడం.. ఈక్రమంలో వచ్చే ఫ్లైట్ యాక్షన్ సీక్వెన్స్ అలరిస్తాయి. ద్వితీయార్ధంలో కథని ఊహకందని మలుపులతో ట్విస్టీగా నడిపించే ప్రయత్నం చేశారు దర్శకుడు. కానీ, అది ప్రేక్షకులకు ఏమాత్రం థ్రిల్ పంచదు. ఇక సుదీర్ఘంగా సాగే విమానం హైజాక్ డ్రామా మరింత శిరోభారంగా అనిపిస్తుంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com